ప్రజాపక్షం
శనివారం, డిసెంబరు 21

## అవినీతి 'ఫార్ములా'!

సక్రమంగా ట్రాక్ ఎక్కని ఫార్ములా ఇ–రేస్ ట్రాక్ వీధికెక్కింది. అప్పటి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కెటిఆర్‌ను ఎ1గా పేర్కొంటూ సిబిఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేయడంతో, ఎప్పుడో అటకెక్కిందనుకున్న అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ కేసు విచారణకు హైకోర్టు అనుమతించడం మరో కీలక పరిణామం. నిందితులకు సిబిఐ నోటీసులు జారీ చేసి, ఆ తర్వాత ఏ క్షణమైనా అరెస్టుచేసే అవకాశం ఉన్నప్పటికీ, ఈనెల 30 వరకూ అరెస్టు చేయవద్దని హైకోర్టు ఆదేశాలు జారీచేయడం కెటిఆర్‌కు ఊరట. అత్యంత నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్న తరుణంలో, నాటి పురపాలక శాఖ కార్యదర్శి అర్వింద్ కుమార్‌ను ఎ2గా, హెచ్ఎండిఎ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డిని ఎ3గా పేర్కొన్న సిబిఐ, మరికొందరు అధికారుల పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చినా ఆశ్చర్యం లేదు. అవినీతి జరిగిందా? లేదా? అన్నది పక్కకు ఉంచితే, అధికార దుర్వినియోగం జరిగిందన్న వాదనను ఖండించలేని పరిస్థితి. అవినీతి జరగలేదని, కాబట్టి కేసుకు అర్థంలేదని కెటిఆర్ వాదిస్తున్నా, ఫార్ములా ఇ–కార్ రేస్‌తో ఎలాంటి సంబంధంలేని హెచ్ఎండిఎ ఖాతా నుంచి ఏకంగా రూ.54.88 కోట్లను ఎందుకు చెల్లించాల్సి వచ్చిందనేది ప్రశ్న. పురపాలక మంత్రి హోదాలో ఆయన అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని అనుమానం. ఫార్ములా ఇ–కార్ రేస్‌లో భాగంగా 9, 10, 11, 12 సీజన్ల రేసులను హైదరాబాద్‌లో నిర్వహించే ప్రతిపాదన బ్రిటన్‌కు చెందిన ఫార్ములా ఇ–ఆపరేషన్స్ లిమిటెడ్ (ఎఫ్ఇఒ) చేసింది. స్పాన్సర్‌షిప్ బాధ్యతను ఏస్ నెక్‌ట్స్ జెన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ తీసుకుంది. ఈ రెండు కంపెనీల మధ్య ఒప్పందాలు కుదరడంతో, మౌలిక వసతులు కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. కానీ 2023 ఫిబ్రవరి 11న జరిగిన తొలి రేస్‌తోనే లుకలుకలు బయటపడ్డాయి. ఫీజు, ఇతర మొత్తాల్లో కొంత భాగాన్ని స్పాన్సర్ కంపెనీ భరించింది. అయితే, ప్రభుత్వం తరపున హెచ్ఎండిఎ రూ.12 కోట్లు చెల్లించడం వివాదాస్పదమైంది. ఫార్ములా వన్ సంస్థతో తెగతెంపులు చేసుకున్న స్పాన్సర్ సంస్థ చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం భుజానికెత్తుకోవడం విచిత్రం. ప్రభుత్వమే స్పాన్సరర్‌గా వ్యవహరిస్తుందని కెటిఆర్ మౌఖికంగా చెప్పగా, అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన ఎందుకు స్పందించిందనేది చిదంబర రహస్యం. స్పాన్సరర్‌గా పురపాలక శాఖ వ్యవహరిస్తుందని మంత్రి చెప్పడం, సదరు ఫైల్ చకచకా కదిలి, చివరికి రూ.160కోట్ల డీల్ కెటిఆర్ సంతకంతో పూర్తికావడం ఓ సంచలనం. ఫైలు ఆయనకు వెళ్లకముందే, ప్రమోటర్ ఫీజు కింద ఎఫ్ఇఒ కంపెనీకి ఇవ్వడానికి తొలుత రూ.22.69కోట్లు, మరో నాలుగు రోజుల్లో రూ.23.01కోట్లకు ఇన్వాయిస్ జారీకావడం ఆశ్చర్యకరం. లిఖితపూర్వక ఒప్పందం కుదరకముందే, ఎఫ్ఇఒకి ఉదారంగా చెల్లింపులు చేసేందుకు ఉబలాటం ఎందుకో? ఫార్ములా రేసుతో హెచ్ఎండిఎకు సంబంధం ఏమిటి? పురపాలక శాఖ స్పాన్సరర్‌గా వ్యవహరించాలన్నది ఎవరి నిర్ణయం? ఎఫ్ఇఒతో ఒప్పందం కుదిరింది ఎప్పుడు...చెల్లింపుల ఫైలు కదిలింది ఎప్పుడు? ఎప్పుడో అమల్లోకి రాబోయే ఒప్పందానికి ముందుగానే చెల్లింపులు ఎలా చేస్తారు? అసలు విదేశీ మారక చెల్లింపుల అనుమతులు ఉన్నాయా? ఈ మొత్తం వ్యవహారంపై రాష్ట్ర కేబినెట్ చర్చించిందా? చెల్లింపులను ఆమోదించిందా? ఇలాంటి ప్రశ్నలు కోకొల్లలు. అవినీతి జరగలేదని, తామంతా సత్యసంధులమని నిందితులు చేస్తున్న వాదనలో నిజానిజాలు ఎలావున్నా, అనుమానాలకు తెరపడాలి. ఇ–కార్ రేస్ పారదర్శకత నిరూపణ కావాలి. అంతా సవ్యంగా జరిగితే ఇబ్బందేమీ లేదు. అవకతవకలు ఎప్పటికీ క్షమార్హం కాదు. ప్రజాధనాన్ని దోచుకునే హక్కు ఎవరికీ లేదు. రాష్ట్ర భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే ప్రయత్నాలను జనం ఎన్నటికీ ఆమోదించరు. పార్టీలు.. వాటి మధ్య విభేదాలతో ఈ వ్యవహారానికి సంబంధం లేదు. ఇది కేవలం అధికార దుర్వినియోగ ఆరోపణల కేసు. నిజానిజాలు తేలాల్సిందే. దోషులు శిక్ష అనుభవించాల్సిందే. చట్టానికి ఎవరూ అతీతులు కారు.

# కార్పొరేట్ వర్గాలపై సంపద పన్ను అనివార్యం



ఉజ్జిని రత్నాకరరావు
9490952646

పాలకులు అనుసరిస్తున్న ప్రపంచీకరణ, సరళీకరణ ఆర్థిక విధానాల కారణంగా దేశంలో సగానికి పైగా జనాభా పేదరికంలోకి నెట్టివేయ బడింది. ఆ క్రమంలోనే ఏటా పేదరికాన్ని గుర్తించడం, గణించటం జరుగుతుంది. ఏదిఏమైనా ప్రభుత్వాలు కూడా అంగీకరించిన పేదల సంఖ్య దేశంలో 20 కోట్లు. కరోనా మహమ్మారి మరో 7 కోట్ల మందిని పేదరికంలోకి తోసేసింది. ఈ క్రమంలోనే మధ్యతరగతిగా ఉన్నవారిలో మరో 3కోట్లమంది పేదరికంలోకి దిగజారారు. ఎలా చూసినా కనీసంగా దేశంలో 30కోట్ల మంది ప్రజలు కటిక దరిద్రం లో ఉన్నారని పాలకులు ఒప్పుకున్న మాట నిజం. వికసిత్ భారత్ అంటు దేశం వెలిగిపోతున్నదని, ప్రపంచంలోనే ఐదో ఆర్థికశక్తిగా భారత్ ఆవిర్భవించిందని, తమ సుస్థిర సమర్థపాలనలోనే భారత్ విశ్వగురుగా అవతరించిందని మోదీ ఘనంగా చెప్పుకొంటున్నాడు. తాము అనుసరిస్తున్న ఆర్థిక విధానాలతోనే దేశంలో 20 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని మోదీ ప్రచారంతో ఊదరగొడుతూనే రెండవవైపు దేశ జనాభాలో సగానికి పైగా 80కోట్ల మందికి ఉచిత ఆహారభద్రత కల్పిస్తున్నామని చెప్పటం హాస్యాస్పదం.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న కార్పొరేట్ల అనుకూల ఆర్థిక విధానాల ఫలితంగా గత 10 సంవత్సరాల కాలంలో భారతదేశ బిలీయనీర్ల వార్షిక ఆదాయం ఏకంగా 123 శాతం వృద్ధి కనిపించింది. బిలియనీర్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. మోదీ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పాటించడం లేదు. ఫలితంగా ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. భారతీయ బిలియనీర్ల మొత్తం సంపద ఈ సంవత్సరం లో 42.1 శాతం పెరిగి, 905.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ప్రపంచ వ్యాప్తంగా బిలయనీర్ల సంఖ్య 2015లో 1,757 నుంచి ఈ ఏడాది 2,682 కు పెరిగింది. వీరందరి సంచిత సంపద 6.3 ట్రిలియన్ డాలర్ల నుంచి 14 ట్రిలియన్ డాలర్లకుపెరిగింది. వార్షికంగా 121 శాతం పెరుగుదల ఉంది, భారత్‌లో మాత్రం బాగా పెరిగింది. ఇండియా ఆర్థిక అభివృద్ధికి ఫ్యామిలీ బిజినెస్‌లు ఎంతో దోహదం చేశాయి. వ్యాపార కుటుంబాలకు చెందిన లిస్టెడ్ కంపెనీల సంఖ్య ఇండియాలో 108కి చేరింది.

**కోటీశ్వరుల ఆదాయంపై పన్నులు విధించాలి :**

భారతదేశంలో సంపన్నుల ఆదాయంపై కనీసం రెండు శాతం పన్ను విధిస్తే సంవత్సరానికి రెండు లక్షల కోట్ల ఆదాయం అదనంగా వస్తుందని, దానిని పేదల అభ్యున్నతికి వినియోగించవచ్చని 'ఫ్రెంచ్ ఆర్థికవేత్త' థామస్ పిక్కెట్టి ఢిల్లీకి చెందిన 'థింక్ ట్యాంక్ రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ డెవలపింగ్ కంట్రీస్' ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న థామస్ పికెట్టి సూచించారు. భారత్‌లోని ప్రజల మధ్య అత్యధిక స్థాయిలో ఆదాయ అసమానతలు ఉన్నాయని ఫ్రెంచ్ ఆర్థికవేత్త, 'క్యాపిటల్ ఇన్ 21వ సెంచరీ'లో భారత ఆర్థిక వ్యవస్థ గురించి ప్రసంగించారు. 1.18 మిలియన్ డాలర్లు (రూ.10కోట్లు) కంటే ఎక్కువ ఆస్తులు కలిగిన వ్యక్తులపై రెండు శాతం సంపద పన్ను విధించడం ద్వారా భారత దేశం తన స్థూల దేశీయ ఉత్పత్తిలో 2.73శాతం విలువైన వార్షిక ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపా రు. ఆ విలువైన ఆస్తిపై 33% వారసత్వపు పన్ను విధించవచ్చని పేర్కొన్నారు.

భారతదేశంలో ఒక శాతం అగ్రశేణి సంపన్న భారతీయులు కలిగి ఉన్న జాతీయాదాయ నిష్పత్తి ప్రస్తుతం యునైటెడ్ స్టేట్స్, బ్రెజిల్‌లోని వారి ప్రత్యర్థులను మించిపోయిందని ప్రపంచ అసమానత ల్యాబ్ ప్రచురించిన 3024 నివేదికను ఉటంకిస్తూ పికెట్టి చెప్పారు. 2022–23 వార్షిక సంవత్సరంలో భారతదేశ జనాభాలో అత్యంత ధనవంతులైన 1 శాతం మంది దేశానికి చెందిన మొత్తం సంపదలో 40.1 శాతాన్ని కలిగి ఉన్నారని తెలియజేశారు.

ఇటీవల విడుదలైన ఫోర్బ్స్ జాబితా ప్రకారం భారత్‌లో 100 మంది అత్యంత ధనవంతుల మొత్తం సంపద ట్రిలియన్ డాలర్లు దాటేసిందని వెల్లడించింది. దేశంలో అపర కుబేరుల సంపద 1.1 ట్రిలియన్ డాలర్లు ఉందని పేర్కొంది. రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ 119.5 బిలియ న్ డాలర్లతో టాప్ వన్ స్థానంలో నిలిచినట్టు తెలిపింది. ఆదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ ఆదానీ 116 బిలియన్ డాలర్ల సంపదతో రెండవ స్థానంలో నిలిచిన విషయం విదితమే.

భారతదేశంలో కార్మికుల నిజ వేతనాలు వేగంగా తగ్గిపోతున్నాయి. గ్రామీణప్రాంతంలో కొంతమేర పేదరికం తగ్గుతోంది. కానీ, బిలియనీర్లు రోజురోజుకు పెరుగుతున్నారు. మోదీ ప్రభుత్వ సామాజిక న్యాయాన్ని పాటించడం లేదు. ఫలితంగా ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి.

తెలుసుకొని పరిమితికిమించి చేసే ఖర్చుపై పన్ను విధించాలని ప్రజల నుంచి డిమాండు వస్తున్నది.

దేశంలో 167 మంది బిలీయనీర్లు ఉన్నారని అంచనా. వీరి సంఖ్య అమితంగా పెరుగుతుంది. రెండు శాతం పన్ను అదనంగా విధిస్తే కనీసం రూ.1.5లక్షల కోట్లు సమీకరించవచ్చు. ఈ మొత్తాన్ని అభివృద్ధి కార్యక్రమాలకు, ఉద్యోగాల కల్పనకు, కార్మికులకు ఎక్కువగా వినియోగించే ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయాలి. వారసత్వ సంపద మీద భారత్ లో పన్నులు లేవు. అమెరికాతో పోల్చుకుంటే పెట్టుబడులపై వచ్చే ఆదాయంమీద పన్నులు చాలా తక్కువగా ఉన్నాయి. ప్రస్తుత పన్నుల విధానం సంపన్నులకు అనుకూలంగా ఉన్నది. కరోనా మహమ్మారి దేశాన్ని వణికించిన సందర్భంగా మోదీ ప్రభుత్వం కార్పొరేట్లపై పన్ను రేటును తగ్గించింది. ఫలితంగా ప్రభుత్వ ధనాగారం రూ.1.84 ట్రిలియన్లు కోల్పోయింది. ఒక ట్రిలియన్ నిధులతో 20 మిలియన్ల ఉద్యోగాలను సృష్టించవచ్చునని ఆర్థిక వేత్తలు చెప్పుతున్నారు. దేశంలోనూ ప్రపంచవ్యాప్తంగా పన్నులు ఎగవేసిన కంపెనీలపై అధ్యయనం చేయాలి. 2003లో జరిగిన టాక్స్ జస్టిస్ నెట్వర్క్ అడ్వకసి గ్రూప్ అధ్యయనం ప్రకారం,



దేశంలోని కార్పొరేటర్లు విపరీతమైన లాభాలు మూటగట్టుకుంటున్నారు. వారికే మోదీ ప్రభుత్వం అనేక రాయితీలు ఇస్తు గ్రామీణ అభివృద్ధికి నిధులు పెంచలేదు. పేదలకు ఉపాధి కల్పిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు గత ఏడాది కన్నా తగ్గించింది. అత్యంత సంపన్నులపై పన్ను విధించి దేశ అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తున్న వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి, విద్య, వైద్య అభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు పాటుపడాలని కోరుతున్నారు.

ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ రెండు ప్రధానమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. భారీ స్థాయిలో ఉద్యోగాలను సృష్టించాలి. తక్కువ ఆదాయాలు కలిగిన వర్గాల ప్రజలకు ఆదాయాన్ని పెంచాలి. ఈ రెండు సమస్యలను తీర్చడానికి గత దశాబ్దిలో అనుసరించిన విధానాలను విడనాడా లి. ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచాలంటే కేంద్రప్రభుత్వం అత్యంత సంపన్నులపై కొంత భారాన్నిమోపక తప్పదు.

అత్యంత సంపన్నులపై పన్ను విధించాలన్న ప్రతిపాదనను ప్రపంచ స్థాయిలో చర్చిస్తున్నారు. ఈ ఏడాది నవంబర్ 18,19 తేదీలలో బ్రెజిల్ లో జి20 దేశాల శిఖరాగ్రసమావేశం ఈ సమస్యను చర్చించింది. ఈ ప్రతిపాదనను బ్రెజిల్, దక్షిణాఫ్రికా ఆమోదించింది. ఈ సమావేశాల్లో పాల్గొన్న ప్రధాని మోదీ ఈ ప్రతిపాదనపై మౌనం వహించారు. మన దేశంలో బిలియనీర్లపై పన్ను విధించడానికి సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ ప్రశ్నిస్తుంది. ఇటీవల ముఖేష్ అంబానీ తన కుమారుడి పెండ్లికి అత్యంత భారీగా ఖర్చుచేశారు. సంపన్నులు వివాహాలకు ఏవిధంగా ఖర్చు చేస్తున్నది అంబానీ ఇంట జరిగిన పెండ్లి తెలియజేస్తుంది. భారత్ లో వివాహాలకు అత్యంత సంపన్నులు ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నా రు. ఇలా ఖర్చు చేస్తున్న వారిలో పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు చలనచిత్ర రంగానికి చెందిన కళాకారులు, అత్యంత సంపన్నులైన రాజకీయవేత్తలు ఉన్నారు. వీరు వివాహాలకు ఎంత ఖర్చు చేస్తున్నారో ఖచ్చితంగా

ప్రపంచం 4.8 ట్రిలియన్ డాలర్లు కోల్పోతుందని అంచనాకు వచ్చింది. వీరిలో అనేకమంది భారతదేశానికి చెందినవారు. ఈ టాక్స్ అబ్జర్వేటరీ ఈ సంవత్సరం అందించిన నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్లు 0.05శాతం మధ్య తమ సంపదపై పన్ను చెల్లిస్తున్నారు. ఇదే సమయంలో బడా కంపెనీల అత్యంత సంపన్నుల లాభా లు పెరిగాయి.

ఆక్స్ ఫామ్ ఇటీవల వివిధ సంస్థల నుంచి వెలువడిన నివేదికల ప్రకారం, అత్యంత సంపన్నులపై పన్ను అదనంగా విధించడం ఎప్పుడో జరిగి ఉండవలసి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సంవత్సరం నూతన నివేదికను విడుదల చేసింది. 2020 నుంచి ప్రపంచంలో అత్యధిక సంపన్నులైన ఐదుగురి సంపదలు రెట్టింపు పెరిగాయి. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి అనుసరిస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాల ఫలితంగా దేశంలోని కార్పొరేటర్లు విపరీతమైన లాభాలు మూటగట్టుకుంటున్నారు. వారికే మోదీ ప్రభుత్వం అనేక రాయితీలుఇస్తు.. గ్రామీణ అభివృద్ధికి నిధులు పెంచలేదు. పేదలకు ఉపాధి కల్పిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు గత ఏడాది కన్నా తగ్గించింది. అత్యంత సంపన్నులపై పన్ను విధించి దేశ అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తున్న వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి, విద్య, వైద్య అభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు పాటుపడాలని కోరుతున్నారు.

# చరిత్రను భావితరాలకు తెలిపేవి పుస్తకాలే

మానవాళికి ఆలోచించడం నేర్పింది అక్షరమైతే.. .ప్రపంచ గతిని మార్చేలా చేసింది పుస్తకం. అనుభవం, జ్ఞానం ఒకతరం నుంచి మరొక తరానికి అందించే ఏకైక సాధనమే పుస్తకం. పట్టుకుంటే పూర్తయ్యేదాకా వదిలిపెట్టనివ్వవు...పిడుగు పడ్డా తెలియనంతగా మరోలోకంలోకి తీసుకుపోతాయి. ఎంత గొప్ప వక్తనైనా మౌనంగా మార్చేస్తా యి. ఈ ఉపోద్ఘాతమంతా దేనిగురించో ఈపాటికే మీకు అర్థమయింటుంది అదేనండి పుస్తకం. మన వ్యక్తిత్వాన్ని మెరుగుపరుచుకోవడానికి, విజ్ఞానా న్ని అందించడానికి మన ఆలోచనా శక్తిని మెరుగుపరచుకోవడానికి పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయి. పుస్తకం ఆనందాన్నిస్తుంది, అలవాట్ల ను మారుస్తుంది, మంచి స్నేహితుడిలా మార్గనిర్దేశనం చేస్తుంది. అక్షర రూపం దాల్చిన ఒక సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిస్తుంది అన్నారు కాళోజి. భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పుస్తకాలు చదివి అపారమైన విజ్ఞానాన్ని సొంతం చేసుకున్నారు. గ్రంథ పఠనానికే ప్రాముఖ్యతనిచ్చి భోజనం చేయడం మర్చిపోయిన సందర్భాలెన్నో ఆయన జీవితంలో ఉన్నాయి. చిరిగిన చొక్కా తొడుక్కో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో అని కందుకూరి వీరేశలింగం ఏనాడో సెలవిచ్చారు. అయితే చెడ్డ పుస్తకాలను చదవడం విషం సేవించడంతో సమానమని టాల్ స్టాయ్ ప్రవచించారు.

పుస్తకాలు చదవడం వలన జ్ఞానాన్ని సంపాదించడమే కాకుండా, మానసిక ఒత్తిడి తగ్గుతుంది. మహానుభావుల విజయగాథలు, ఆత్మకథలు, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతా యి. పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని సంపాదించి ఎందరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. అందమైన అక్షరాలు, పదాల పలకరింపుతో పాఠకున్ని తనలో లీనం చేసుకుంటుంది పుస్తకం. ఇక విజ్ఞానాన్ని అందించే భాండాగారం పుస్తకం. ఉదయా న్నే ఛాయ్ తాగినప్పుడు మొదటి చప్పరింపు ఎంత హాయిని ఇస్తుందో పుస్తకం అంతే ఆహ్లాదాన్ని ఇస్తుంది అంటారు కొందరు. అందువలన అందరూ కనీసం రోజుకు ఒక్క పుస్తకమైనా చదవాలని చెబుతుంటారు పెద్దలు.

జీవితం బాగుంటే నల్లేరుమీద నడక, లేకుంటే నిరంతర నరకయాతన. ఆ నడవడిని శాసించేది చదువైతే, పాటించేది మన చేతుల్లోని మంచి పుస్తకం. చదువూ సంస్కారం, విద్యాబుద్ధులు వంటి పదబంధాల అర్థతాత్పర్యాలు పుస్తకాల్లోనే లభిస్తాయి. అమ్మ లాలన, నాన్న పాలన, గురువుగా హితబోధన, ఆప్తమిత్రునిగా అనుశీలన అన్నారందుకే. 'వ్యక్తి చక్కబడిన వర్ధిల్లు జగమెల్ల'



అని సుగుణజాల కృతికర్త అభిభాషణ. తనను తాను తెలుసుకోవాలన్నా, సహచరుల్లా తెలియజేయాల న్నా పుస్తకాలే ఏకైక మార్గాలు. కనిపెట్టి చూస్తే.. మెదడును పాడు చేసే, శరీరాన్ని క్షీణపరిచే, ఏ దిక్కూ మొక్కూ లేకుండా చేయగలిగే చెడ్డ పుస్తకా లూ బోలెడన్ని గుట్టలుగా పడి ఉన్నాయిప్పుడు. వాటన్నింటినీ పక్కకునెట్టి, మనకూ తోటి వారికీ మేలు కలిగించే పుస్తక నేస్తాన్ని ఎంచుకోవడమే విజ్ఞత. ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు, ఇంకా ఎన్నెన్నో ఇప్పటికీ మన మదిగదిని ఆక్రమించాయి. వాటిల్లో కుప్పలు తెప్పలుగా వచ్చిపడేవాటి ని ఇలా చూసి అలా పక్కకి వెళ్లిపోవడం కాదు, చదువంటే. చూడటం, చదవడం ఏనాడూ ఒక్కటి కాలేవు. అక్షరాల వెంట చూపులు పరుగులు తీయడమే పుస్తకపఠనం అనిపించుకోదు. కళ్లతో చూసే వి మనసు లోపలికి చేరినప్పుడే చదివినట్లు లెక్క. మిగతావన్నీ కట్టలుకట్టిన మాటల మూట లే. వాటిని విప్పి చూడకుండా మనం ఏదీ తెలుసుకోలేం. ఆ కారణంగానే – పుస్తకాన్ని చూడటం కన్నా, ఆసాంతం చదవడమే అన్ని విధాలా మిన్న.

ప్రస్తుతం పుస్తకాలు చదవడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. గతానికి ప్రస్తుతానికి చాలా తేడా ఉంది. గతంలో చాలా పుస్తకాలు గ్రంథాలయాల్లో ఉండేవి. కానీ చదువుకోవాలని ఆశ ఉన్నవారికి మాత్రం డబ్బులు ఉండేవి కాదు. ఉదా : అంబేద్కర్‌కు పుస్తకాలంటే చాలా ఇష్టం కానీ కొనుక్కోవడానికి అతని దగ్గర డబ్బులు ఉండేవి కాదు. అందువలన ఆయన ఒక రోజు లైబ్రరీలో ఉండి ఒక పుస్తకం చదువుకొని దాన్ని తిరిగి ఇచ్చి మరొక పుస్తకం తెచ్చుకునే వారు. ఈ తరం అంటే మన తరం చెప్పడానికి ఏం ఉంది సగం జీవితం పుస్తకం అయితే ఇంకో సగం జీవితం ఇంటర్నెట్‌లో గడపడానికే సమయం కుదరడం లేదు. ఇప్పటి పిల్లలకు పుస్తకాలంటే విసుగు. ఎప్పుడూ సోషల్ మీడియాలో ఉంటూ కాలం గడుపుతున్నారు. రానురాను కాలంలో పుస్తకాలను మ్యూజియంలో పెట్టుకొని చూడటం తప్పితే చదవడానికి ఆసక్తి చూపించే వారు ఉండరేమో అన్న అనుమానం కలుగుతున్నది. అందువలన పుస్తకాన్ని చదవడం మర్చిపోకుండా ఉండటానికి పుస్తక పఠనాన్ని తల్లిదండ్రులు, పెద్దలు బాధ్యతగా స్వీకరించి పిల్లలతో చిన్నప్పటి నుండే చదివించాలి. పుస్తక పఠనం వల్ల పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుంది. ఇండ్లలో వివిధ రకాల పుస్తకాలతో కూడిన లైబ్రరీని ఏర్పాటు చేయాలి. ప్రతి ఏటా హైదరాబాదుతో పాటు ఇతర నగరాల్లో బుక్ ఫెయిర్‌లు నిర్వహిస్తున్నారు. ఇటువంటి బుక్ ఫెయిర్ ల కు పిల్లలను తీసుకువెళ్లాలి. ప్రస్తుత చరిత్రను భావితరాలకు అందించేవి పుస్తకాలే అన్న విషయాన్ని పిల్లలకు తెలియజెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీదే ఉందని గ్రహించాలి.

ఎవి సుధాకర్, ఎస్‌టియుటిఎస్
9000674747

# రాష్ట్రం అప్పుల ఊబిలోంచి బయటపడేది ఎలా?

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఒక సంవత్సరం పూర్తి చేసుకుంది. వారి ముందున్నది లక్షల కోట్ల అప్పులు.. నెలనెలా వేల కోట్ల వడ్డీ భారం ఒకవైపు.. సంక్షేమ కార్యక్రమాల అమలుకు కోట్లాది రూపాయల అవసరం మరోవైపు.. ఇలా వెంటాడుతు న్న ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కేందుకు రేవంత్ సర్కారు కసరత్తు మొదలుపెట్టింది. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడం.. అదే సమయం లో కొత్త మార్గాలను అన్వేషించి సమస్యను అధిగమించే ప్రయత్నం చేయడం.. అన్ని రంగా ల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టి జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులు ఆహ్వానించడంలాంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించింది.

లెక్కకు మించిన సంక్షేమ పథకాల వల్ల ఆర్థిక వ్యవస్థపై పడుతున్న భారాన్ని తగ్గించుకొని ప్రయత్నాలు చేస్తుంది. అంచనాలు దాటిపోతున్న ఆర్థిక వ్యయాన్ని సాధ్యమైనంత మేరకు కట్టడి చేయడంతో పాటు శాఖల వారీగా ఆదాయ మార్గాలపై కసరత్తు చేయాలని తాజాగా జరిగిన కేబినెట్ భేటీలోనూ సిఎం రేవంత్ రెడ్డి తన అభిప్రాయాలను మంత్రివర్గ సహచరులతో పంచుకున్నారు. అప్పులకుప్ప పేరుకు పోయిన తరుణంలో భవిష్యత్తు ప్రశ్నార్థకం కాకముందే చర్యలకు పూనుకోవాల న్న కోణంలో అందరూ దృష్టి కేంద్రీకరించాలని విలువైన సూచనలు, సలహాలు ఇవ్వాలని విజ్ఞప్తి కూడా చేశారు.

**ఇది అప్పుల భారం:** గత బిఆర్ఎస్ సర్కార్ చేసిన అప్పులు అక్షరాల రూ. 6,71,757 కోట్లు అని, కాంగ్రెస్ అధికారంలోకి రాగా నే అసెంబ్లీలో పెట్టిన వైట్‌పేపర్‌లో రాష్ట్ర ఆర్థికమంత్రి స్పష్టంగా పేర్కొన్నారు. వీటికి తోడు రూ.40,154కోట్ల పెండింగ్ బిల్లులు కూడా కలుపుకొంటే మొత్తం రూ. 7.11లక్షల కోట్ల అప్పులు. గత బిఆర్ ఎస్ వారు కాంగ్రెస్ ప్రభుత్వం నెత్తిన పెట్టిపోయారని పేర్కొన్నారు. దీనికితోడు ప్రభుత్వ భూములను, చివరికి ఓఆర్ఆర్ సైతం అమ్మివేశారు. దీనిపై గత అసెంబ్లీ సమావేశంలోనే చర్చ జరిగింది.

నిన్న ఇవాళ జరిగిన అసెంబ్లీ సమావేశంలో బిఆర్ఎస్ చేసిన అప్పులు చేసిన రూ.4.17లక్షల కోట్లే అని మాజీ ఆర్థిక మంత్రి హరీష్ రావు కౌంటర్ చేస్తూ వాదించటం జరిగింది. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల గొప్పగా బిఆర్ఎస్ మార్చిందని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. గత ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చేందు కు కాంగ్రెస్ సర్కారు రోజుకు సగటున రూ.25కోట్లను ఖర్చు చేస్తుందని ఖజానా ఖాళీ కావడంతో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు సమీకరించాల్సి వస్తుందని అధికార పార్టీ నేతలు, మంత్రులు చెబుతున్నారు. తెలంగాణ 2014 జూన్ 2న ఏర్పడినప్పుడు ఉమ్మడి రాష్ట్రం నుండి వచ్చిన అప్పు లు 72,658కోట్లు. ఈ పదేండ్లలో అప్పులు 10రెట్లు పెరిగి రూ.6.71లక్షల కోట్లకు చేరాయి.

ఎఫ్ఆర్‌బిఎం పరిమితులపై కూడా అంతర్గత ఆందోళన మొదలైంది. ఆర్థికరంగ నిపుణులతో సంప్రదించి ఆదాయ మార్గాలను అన్వేషించాలని రేవంత్ ప్రభుత్వం యోచిస్తుంది. ముఖ్యమంత్రి సూచన మేరకు దిశగా కార్యాచరణ అమలుకు కీలక శాఖలు ఉన్నతాధికారులు సమావేశమై ప్లాన్స్ రూపొందించుతున్నారు. తాజాగా ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం కలిసిన సందర్భంలో సిఎం రేవంత్ రెడ్డి ఈ అంశంపై వారితో చర్చలు జరిపారు. ఆర్థికవేత్తలతో, మేధావులతో నూ మేధోమథనం ద్వారా కార్యాచరణకు సిద్ధమవుతున్నారు.

**ప్రజలపై పెరుగుతున్న రుణభారం :** కెసిఆర్ సిఎం గా2015–16సంవత్సరంలో రాష్ట్ర రుణభారం జిఎస్‌డిపీలో 15.7 శాతంగా ఉంది. అప్పట్లో దేశంలోనే ఇది అత్యల్పం. అయితే ఇది 2023–24 నాటికి 27.8 శాతానికి పెరిగింది. అప్పుల పై వడ్డీల చెల్లింపు 2014–15 రూ.7,255 కోట్లుగా ఉన్నాయి. ఈ అప్పులు 2023–24 నాటికి రూ.53,878 కోట్లకు చేరినట్టుగా అధికార లెక్కలు చెబుతున్నాయి. గతంలో మొత్తం ఆదాయంలో చెల్లింపులు 14% పోగా, ఇప్పుడు 36 శాతానికి పెరిగాయి.

**పెరిగిన జీతభత్యాలు పెన్షన్లు:** ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు ప్రస్తుతం రూ.55,752కోట్లు అవసరం. అంతకుముందు ఇది రూ.51,651 కోట్లుగా ఉండేది. రేవంత్ ప్రభుత్వం పెన్షన్లను పెంచింది. గత బి.ఆర్.ఎస్ ప్రత్వం ఎఫ్ఆర్‌బిఎం కు మించి అప్పులు చేసినట్టుగా కాగ్ నివేదికను రేవంత్ రెడ్డి ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టి రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.11,48,115కోట్లతో అప్పుల వాటా 37.77 శాతంగా కాగ్ తెలిపింది. బడ్జెట్లో ఎక్కువ కేటాయింపులు చేస్తూ తక్కువ వ్యయం చేసిన విషయాన్ని కాగ్ గుర్తించింది. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రైతు రుణమాఫీ వంటి పథకాలకు బడ్జెట్లో కేటాయింపుల కంటే తక్కువగా ఖర్చు చేసినట్టుగా తెలిపింది. ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సును పెంచడంతో జీతాల భారం పెరిగింది. ఏదిఏమైనా అప్పల నుండి బయటపడుతూ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి వైపుబాటలు వేయాలని రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలని ఆశించుదాం.

# మహోన్నత గణిత శిఖరం రామానుజన్

ప్రతి సంవత్సరం డిసెంబరు 22ను మ్యాథమెటిక్స్ డే గా జరుపుకుంటున్నాం కదా! ఎందుకో తెలుసా! గణితశాస్త్రంలో ఆర్యభట్ట, భాస్కరాచార్యులు, తరువాత భారతదేశానికి పేరు తెచ్చిన గొప్ప మేధావి శ్రీనివాస రామానుజన్ ఆరోజు పుట్టడమే ఒక విశేషం.

రామానుజన్ పుట్టిన రోజైన డిసెంబర్ 22ను ఏటా 'జాతీయ గణిత దినోత్సవం'గా జరుపుకోవాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. భారతదేశానికి చెందిన గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్. 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు శ్రీనివాసరామానుజన్ తమిళనాడు లోని ఈ రోడ్‌లో కోమలతామ్మాళ్, శ్రీనివాస అయ్యంగార్ దంపతులకు ఓ పేద బ్రాహ్మణ కుటుంబంలో డిసెంబర్ 22వతేదీన 1887వ సంవత్సరంలోజన్మించారు. శ్రీనివాసరామానుజన్ విద్యార్థిదశ నుంచే గణితశాస్త్రం పట్ల అమితాసక్తి కలిగి ఎన్నో గణితసిద్ధాంతాలను ఆవిష్కరించారు. చిన్నతనంనుంచేరామానుజన్ గణితంపట్ల అద్భుతమైన తెలివితేటల్ని ప్రదర్శించేవాడు. 13ఏళ్ల చిరుప్రాయంలోనే గణితశాస్త్రంలోని 'ట్రిగనోమెట్రీ (త్రికోణమితి)'అనే క్లిష్టమైన అంశంపై పట్టు సాధించాడు. లెక్కల పుస్తకాల్లోని అనేక సిద్ధాంతాల్ని రూపొందించారు. రామానుజన్ కఠినమైన లెక్కల్నిసునాయాసంగా చేసేవాడు, చదువులో పెద్దపెద్ద డిగ్రీలు లేకపోయినప్పటికీ గణితశాస్త్రంలో అసమాన ప్రతిభ కనబర్చిన మహనీయుడు శ్రీనివాస రామానుజన్. 15 ఏళ్ల వయసులో ఆయన చేసిన లెక్కల పుస్తకాలని ఈనాటికీ గణిత శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తూనే ఉన్నారు.

రామానుజన్ చెన్నైకి దగ్గరలో ఉన్న కాంచీపురంలో చిన్న పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ప్రారంభించాడు. అతడి ప్రాథమిక విద్య సరిగా ఒకే చోట సాగలేదు, మద్రాసు, కుంభకోణం కాంచీపురం అలామారసాగింది.

పదేళ్ళకే ఆంగ్లం, తమిళం, భూగోళ శాస్త్రం, గణితంలోనూ ప్రాథమిక విద్య పూర్తి చేశాడు. పదేళ్ల వయస్సు నుంచే గణితంలో ప్రజ్ఞను ప్రదర్శించిన ఆయన.. గణితంలో కష్టసాధ్యమైన 'త్రికోణమితి' విభాగంపై పన్నెండేళ్ల వయస్సులోనే పూర్తిగా పట్టుసాధించారు. ఆయన ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం కుంభకోణంలోని కళాశాలలో చదువుకోవడానికి స్కాలర్‌షిప్ ఇచ్చింది. కానీ కేవలం గణితంతప్ప మిగతా గణితేతర సబ్జెక్టుల్లో ప్రతిభచూపకపోవడంతో ఆ తరువాత స్కాలర్‌షిప్‌ను నిలిపివేశారు. ఆయన 22వ యేట రామానుజన్‌కు జానకీ అమ్మాళ్ అనే తొమ్మిదేళ్ళ బాలికతో వివాహమైంది.. తరువాత ఉద్యోగ ప్రయత్నాలు ఆరంభించాడు. మద్రా స్ పోర్టు ట్రస్టు కార్యాల యంలో గుమాస్తాగా చేరి, ఆ డబ్బుతో మరో కాలేజీలో చదువుతూ.. గణిత పరిశోధనలు చేశారు. హిల్ అనే గణితజ్ఞుడు రామానుజన్ పరిశోధనల్లో కొన్నిలోపాలున్నాయని వ్యాఖ్యానించాడు. హిల్, రామానుజన్‌ను విద్యార్థిగా స్వీకరించేందుకు అంగీకరించలేదుగానీ, రామానుజన్ పరిశోధనలపై మంచి సలహాలు మాత్రం ఇచ్చారు. ఆయన ఆవిష్కరించిన 120 గణిత సిద్ధాంతాలను కేంబ్రిడ్జ్ ప్రొఫెసర్ జి.హెచ్.హార్డీకి పంపారు. రామానుజన్ మేధస్సుకు ఆశ్చర్యపడిన హార్డీ ఆయనను బ్రిటన్‌కుఆహ్వానించారు.



అంతేకాక, 2812–1918న రామానుజన్‌ను 'ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ'మెంబర్‌గా ఎన్నుకున్నారు. దీంతో రాయల్ సొసైటీలో ఫెలోషిప్ పొందిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందారు. కేవలం 30 ఏళ్ళ వయస్సులోనే గణితంలో అనేకచిక్కుసమస్యలను పరిష్కరించి, ఎన్నో కొత్తసిద్ధాంతాలను ఆవిష్కరించారు.

1914లో రామానుజన్ ఇంగ్లండుకు ప్రయాణమయ్యాడు.శాఖాహారపుఅలవాట్లుగలరామానుజన్ ఇంగ్లండులో స్వయంపాకం చేసుకునేవాడు. సరిగ్గా తినకపోవడం మూలాన, నిరంతర పరిశోధనల వల్ల కలిగిన శ్రమ వలన, ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల చాలా తీవ్రమైన పరిశ్రమ చేసి 32 పరిశోధనా పత్రాలు సమర్పించాడు. శరీరం క్రమంగా వ్యాధి గ్రస్థమైంది. తీవ్రమైనఅనారోగ్యంతో ఉన్నపుడు కూడా హార్డీతో 1729 సంఖ్య యొక్క ప్రత్యేకతను తెలియజెప్పి ఆయన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేశాడు. ఈ సంఘటన గణితంపై ఆయనుకున్న అవ్యాజమైన అనురాగాన్ని, అంకిత భావానికి నిదర్శనం. ఆ కొద్దికాలంలోనే రామానుజన్ దాదాపు 3200 ఈక్వేషన్స్‌ను, ఐడెంటీటీస్‌ను సాధించారు. 'రామానుజం ప్రైమ్, రామానుజం టీటా ఫంక్షన్' లను రూపొందించారు.. కొద్దిరోజులకే రాయల్ సొసైటీ, ట్రినిటీ కళాశాల ఫెలోషిప్‌లను పొందారు. క్షయవ్యాధికి గురై ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 1919 మార్చిలో భారతదేశానికి తిరిగి వచ్చాడు. ఆయన పిన్నవయస్సులోనే 1920, ఏప్రిల్26న పరమపదించారు. భారత ప్రభుత్వం 1962 వ సంవత్సరంలో ఆయన 75వ జన్మదినం నాడు, సంఖ్యా శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషిని కొనియాడుతూ 'స్మారక తపాలా బిళ్ళ'ను విడుదల చేసింది.

దేశవ్యాప్తంగా ఉన్నఅన్నిపాఠశాలల్లో గణితపోటీలు నిర్వహించి, రామానుజన్ పేర బహుమతులు ఇచ్చి బాలలకంతా గణిత ప్రజ్ఞాశాలి ఐన ఆయన గురించీ తెలియజెప్పడమూ మన బాధ్యతగా భావించాలి.

నరేష్, 8247887267

## పారదర్శకంగా నిధుల వినియోగం

గ్రంథాలయ సర్వసభ్య సమావేశంలో అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గ్రంథాలయ సంస్థ వద్ద అందుబాటులో ఉన్న నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 17 గ్రామ పంచాయతీలలోని పబ్లిక్ రీడింగ్ రూములకు రూ.14,09,275 చెల్లించాల్సి ఉండగా గతంలో బడ్జెట్ లాప్స్ కావడం జరిగిందన్నారు. ప్రస్తుతం 2024–25 సంవత్సరంలో పబ్లిక్ రీడింగ్ రూమ్స్ పద్దుపై అందుబాటులో ఉన్న రూ. 10 లక్షలను చెల్లించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఇంకా చెల్లించాల్సిన రూ.4,09,275 లను గ్రంథాలయ సంస్థ రీడింగ్ రూమ్స్ నిర్వహణ పద్దు క్రింద కేటాయించాల్సిందిగా కోరుతూ సంచాలకులు పౌర గ్రంథాలయ శాఖకు ప్రతిపాదనలు పంపాలని అదనపుకలెక్టర్ సంబంధిత అధికారులకు తెలిపారు. జిల్లాలో ఉన్న గ్రంథాలయ మరమ్మతుల కోసం రూ. 83 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి రూ.50 లక్షలు ఖర్చు చేయుటకు అనుమతులు ఇవ్వడం జరిగిందని, మిగిలిన రూ. 33 లక్షలు ఖర్చు చేయుటకు తదుపరి జరిగే సర్వసభ్య సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి గ్రంథాలయ సెస్‌ను ఎప్పటికప్పుడు చెల్లించేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, వయోజన విద్య ఉప సంచాలకులు జయశంకర్, గ్రంథాలయ కార్యదర్శి అర్జున్, గ్రంథాలయ సిబ్బంది జె. భాస్కర్, అఖిల్ పాల్గొన్నారు.

## ఇన్ఫోసిస్ సంస్థను సందర్శించిన ఎస్‌బిఐటి విద్యార్థులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రముఖ బహుళజాతి సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్‌ను మొదటి సంవత్సరం సిఎస్‌ఈ విద్యార్థులు సందర్శించినట్లు ఎస్‌బిఐటి కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ లోని పోచారం క్యాంపస్‌ను సందర్శించి సాఫ్ట్‌వేర్ రంగంలో పనితీరును విద్యార్థులు అర్థం చేసుకునేలా సంస్థ ప్రతినిధులు ప్రజంటేషన్ ఇచ్చారన్నారు. తద్వారా సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టుల డెవలప్‌మెంట్, టెస్టింగ్‌లపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని గుండాల కృష్ణ తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా.జి. ధాత్రి మాట్లాడుతూ తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) , ఇన్ఫోసిస్ సంయుక్త ఆధ్వర్యంలో తమ కళాశాల విద్యార్థులకు ఈ అవకాశం లభించిందని గతేడాది తాము ఇన్ఫోసిస్‌తో చేసుకున్న అవగాహన ఒప్పందం ఇందుకు దోహదపడిందని తెలిపారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ ద్వారా తమ విద్యార్థులకు ఉచితంగా పలు ఆధునీక కోర్సులు అందించగలిగామని ఆమె తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ వంటి అడ్వాన్స్డ్ ప్రాజెక్టుపై ఇన్ఫోసిస్ ప్రతినిధుల ప్రజంటేషన్ తమ విద్యార్థుల ఆలోచనలను మార్చాయని రానున్న రోజుల్లో సంస్థ చేపట్టనున్న ప్రాజెక్టులు ఆసక్తిని కలిగించాయని ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్ఫోసిస్ సంస్థ రిలేషన్‌షిప్ మేనేజర్ నివాస్, సిమ్రాన్, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జె. రవీంద్రబాబు, ఎస్. శ్రీనివాసరావు, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేసిన చెక్కులను శుక్రవారం ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు లబ్దిదారులకు పంపిణీ చేశారు. 54 మంది లబ్దిదారులకు రూ.13,81,500ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, బొర్రా రాజశేఖర్ మాట్లాడుతూ వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స పొందిన పేదలకు ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి సిఫారసు మేరకు మంజూరైన చెక్కులను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో స్వర్ణ నరేందర్, మట్టె గురవయ్య, కోసూరి శ్రీను, స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, ఇమామ్ బాయ్, చల్లా రామకృష్ణరెడ్డి, కన్నెబోయిన సీతారాములు, రాయల పుల్లయ్య, మోషె, ఎయిర్ టెల్ నర్సింహారావు, కాంపాటి రమేష్, బోడ శ్రావణ్, సురేష్‌నాయక్, ఇమ్మడి తిరుపతిరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి : సిపిఐ

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** డా.బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర రక్షణ శాఖ మంత్రి అమిత్‌షా వాఖ్యలకు నిరసనగా వేంసూరు రోడ్డులో అమిత్‌షా దిష్టి బొమ్మ ను దగ్ధం చేశారు. ఈ సందర్బంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ భారతదేశం కోసం, భారతదేశంలోని విభిన జాతులు, కులాలు, మతాలు, పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం రాసిన రాజ్యాంగాన్ని అవమానించేలా అంబేద్కర్‌ని దూషించటం హేయమైన చర్యని, దీనిని సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అమిత్‌షా తక్షణమే మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, సత్తుపల్లి, పెనుబల్లి, తల్లాడ, కల్లూరు, వేంసూరు మండలాల కార్యదర్శులు తడికమళ్ళ యోబు, సుదాకర్, రమేష్, దయాకర్, పిల్లి బాస్కర్, కౌన్సిల్ సభ్యులు రామలక్ష్మి , మహిళా సంఘం డివిజన్ కన్వీనర్ ఎస్‌కె రంజాన్‌బీ, ఎఐటియుసి మండల అధ్యక్షుడు తెలగారపు రామారావు, బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్, ఉపాధ్యక్షులు భీమయ్య, హమీద్, రమేష్, అజయ్, రహ్మతుల్లా, శ్రీను, సీతమ్మ, సత్యనారాయణ, కేశవరావు, వెంకటేశ్వరరావు,లక్ష్మి కాంతమ్మ, జగన్‌లాల్ పాల్గొన్నారు.



# నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి : కలెక్టర్

ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్






**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నైపుణ్యాభివృద్ధితో సొంత బలం మీద ఉపాధి పొందడమే గాక పది మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ముంపు ప్రాంత ప్రజలకు స్వయం ఉపాధికి ఆర్‌సిఎం బిషప్ సగిలి ప్రకాష్ ఆధ్వర్యంలో కరుణగిరి బైపాస్ రోడ్డులోని కారుణ్య కమ్యూనిటీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదలతో ఎన్నో బాధలుపడి ధైర్యంగా నిలదొక్కుకున్నామన్నారు. నైపుణ్య కార్యక్రమాల ద్వారా జీవన రీతిని, పద్దతిని మార్చుకొనుటకు అవగాహన కలుగుతుందన్నారు. మహిళలు కుట్టుమిషన్, హోం నర్సింగ్, విస్తరాకులు, కప్స్, క్యాండిల్స్, ఆగర్‌బత్తిల తయారీ, బ్యూటీషియన్ తదితర వాటిలో నైపుణ్యం పొంది స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలన్నారు. మనం అభివృద్ధి చెందినప్పుడే కుటుంబాలు, సమాజం, గ్రామం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. నైపుణ్య కోర్సు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం నుండి సహాయ సహకరాలను అందిస్తామన్నారు. ఈ సందర్బంగా మహిళలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజీవ్ గృహకల్ప సమీపంలో ఉన్న మదర్ థెరిస్సా ఓల్డేజ్ హోమ్‌ను కలెక్టర్ సందర్శించారు. ఆశ్రమంలో అనాథలకు అందుతున్న సేవలను పరిశీలించారు. వరదల వల్ల దెబ్బతిన్న భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, ఫాదర్ తప్పెట శౌరి వికార జర్నల్, ఫాదర్ మాధ్యు వర ప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రణాళిక

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పక్కా ప్రణాళికతో పని చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్డు సేఫ్టీ కోసం తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా బ్లాక్ స్పాట్స్ గుర్తింపు, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సైన్, స్పీడ్ లిమిట్ బోర్డుల ఏర్పాటు, రోడ్డు సేఫ్టీపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి పలు అంశాలపై కలెక్టర్ చర్చించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగడానికి రెండు కారణాలు ఉంటాయని రోడ్లు బాగా లేకపోవడం, వాహనదారులు నియమాలను అతిక్రమిస్తూ వాహనాలను నడపడం వీటి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో ప్రణాళికలు తయారు చేస్తూ వాటి అమలును నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు. జిల్లాలో ఉన్న స్కూల్ జోన్ ఏరియాలను ట్రాక్ చేయాలని అక్కడ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వల్ల ప్రజలు రోడ్డుపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని కలెక్టర్ తెలిపారు. రోడ్లపై నిర్మాణాలకు సంబంధించిన సామగ్రిని ఉంచడం వల్ల వాహనాలు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. నిర్మాణాల వద్ద ఇటుక, ఇసుకను వారి నిర్మాణ స్థల పరిధిలో పెట్టేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారులు, స్టేట్ రోడ్లు, పంచాయతీ రోడ్లపై అహేతుకమైన స్పీడ్ బంప్‌లను పరిశీలించి తొలగించాలని కలెక్టర్ తెలిపారు. రోడ్డు సేఫ్టీ ప్రమాణాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ఇంజనీరింగ్ అధికారులకు రోడ్డు సేఫ్టీలో పాటించాల్సిన ప్రమాణాల పై అవగాహన కల్పించాలన్నారు. ఎన్‌హెచ్‌లలో ఎక్కడ స్పీడ్ లిమిట్ బోర్డులు కనిపించడం లేదని వీటిని ఏర్పా టు చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మా ట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, ప్ర మాదాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి రాజేశ్వరి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ హేమలత, జిల్లా రవాణా అధికారి వరప్రసాద్, పోలీస్, రవాణా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## త్రివేణి పాఠశాలలో మ్యాథ్స్ ఫెస్ట్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో రెండు రోజులు మ్యాథ్స్ ఫెస్ట్ నిర్వహించారు. మ్యాథ్స్ ఫెస్ట్‌లో భాగంగా విద్యార్థులకు గణిత శాస్త్రానికి సంబంధించి శ్రీనివాస రామానుజన్‌కు సంబంధించినటువంటి అంశాలతో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. శుక్రవారం ఫెస్ట్‌లో భాగంగా గణిత శాస్త్రంపై క్విజ్, టాలెంట్ టెస్ట్, మ్యాథ్స్, రామానుజన్ చిత్రాన్ని గీయడం మొదలగు అంశాలలో పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గణిత శాస్త్రంపై త్రివేణి పాఠశాలలో ప్రత్యేకమైన శ్రద్ద చూపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సిఆర్‌ఓ కాట్రగడ్డ మురళి కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాలు ఉత్సాహంగా జరుపుకుందాం

డివిజన్ వ్యాప్తంగా ర్యాలీలు, ప్రదర్శనలు : రావులపల్లి




**ప్రజాపక్షం/భద్రాచలం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాన్ని ఆనంద భరిత వాతావరణంలో జరుపుకుందామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ డిసెంబర్ 26 నాటికి భారత్‌లో సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు అవుతుందన్నారు. ఈ శతాబ్ది కాలంలో ఎన్నో కష్టనష్టాలు, అంతకుమించిన త్యాగాలను పార్టీ శ్రేణులు చేశాయన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తొలినాళ్ల నుండి నేటి వరకు సిపిఐ ఎనలేని పోరాటాలు చేసిందన్నారు. కార్మికుల పక్షాన నిలబడుతూ కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర వినూత్న ఉధ్యమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కమ్యూనిస్టుల అవసరం దేశానికి ఉందని పలు రాజకీయ పార్టీల నాయకులు బాహాటంగా ప్రకటించడం కమ్యూనిస్టు పార్టీ సేవలకు నిదర్శనం అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, పీడిత జనాల విముక్తి కోసం చేసిన అనేక పోరాటాల్లో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పేద ప్రజల పక్షాన నిలబడుతోందన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా డివిజన్ వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 26వ తేదిన భద్రాచలంలో, 27న దుమ్ముగూడెం, 28న చర్లలో భారీ ర్యాలీలు, ఎర్ర జెండాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరై సిపిఐ శతాబ్ది ఉత్సవాలను విజయ వంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు మారెడ్డి శివాజీ, ఏపూరి వెంకటేశ్వరరావు, మీసాల భాస్కర్ రావు, కొండబాబు, ఎస్‌విఎస్ నాయుడు, త్రిమూర్తులు, వెంకన్న, మహేష్, సీతారామరాజు, సత్యానంద్, రామారావు, శ్రీనివాస్, కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభతోనే క్రీడాకారులకు గుర్తింపు

సిపిఐ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా




**ప్రజాపక్షం/పాల్వంచ:** గెలుపు, ఓటమిని క్రీడాకారులు సమానంగా తీసుకొని క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని. ప్రతిభతోనే క్రీడాకారులకు గుర్తింపు లభిస్తుందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, కొత్తగూడెం మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. శుక్రవారం శ్రీనివాస కాలనీలోని మినీ స్టేడియంలో నిర్వహించిన క్రీడ పోటీల్లో గెలుపొందిన క్రీడా జట్లకు షీల్డులు, ప్రశంసా పత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్బంగా ఏర్పాటైన సమావేశంలో సాబీర్ పాషా మాట్లాడుతూ విద్యా సంస్థలు, పాలకులు, విద్యార్థుల తల్లిదండ్రులు క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు అందుతాయని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని అన్నారు. భద్రాద్రి జిల్లాలో క్రీడాకారులకు కొదువలేదని వారికి కావాల్సిన సదుపాయాలు సౌకర్యాలు కల్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని అన్నారు. జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబర్చి జిల్లాకు వన్నె తేవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ యుగేందర్‌రెడ్డి, కార్యదర్శి మహీధర్, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, క్రీడా అధికారులు, పిఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో పలువురు చేరిక



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో బిఆర్‌ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి పలువురు చేరారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మేయర్ పునుకొల్లు నీరజ సమక్షంలో 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న, బిఆర్‌ఎస్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు తొగరు భాస్కర్, తొగరు రమేష్, ముస్లిం మైనార్టీ నగర కార్యదర్శి షేక్ గౌస్‌పాషాలు బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు యర్రం బాలగంగాధర్ తిలక్, షేక్ రజిబాయ్, పాలకుర్తి నాగేశ్వరరావు, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, కోసూరి రమేష్ గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన కలెక్టర్

దివ్యాంగురాలికి లక్ష రుణం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మానవత్వాన్ని చాటుకున్నారు.ఖమ్మం త్రీటౌన్ జహీర్‌పుర చౌరస్తాలో దివ్యాంగురాలైన దుంగ్రోత్ కమల నాలుగు చక్రాల బండిపై పల్లీలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఇటీవల ఆ ప్రాంతంలో కలెక్టర్ పర్యటిస్తున్న సందర్బంలో కమల బండి వద్ద ఆగారు. కలెక్టర్ అంటే ఎవరో తెలియని కమల పల్లీలు కావాలా సార్ అంటూ అడగడంతో కలెక్టర్ ఓ చిరునవ్వు నవ్వారు. కమల కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నేను మా అమ్మ మాత్రమే ఉంటామని కమల కలెక్టర్‌కు తమ దుర్భర జీవితాన్ని వివరించింది. స్పందించిన కలెక్టర్ ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని మాట ఇచ్చి వెళ్లారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు కలెక్టర్ ఫోన్ చేసి కమలకు రుణం అందించే ఏర్పాటు చేయాలని సూచించారు. కమిషనర్ ఆదేశాల మేరకు మెప్మా డిఎంసి సుజాత, టిఎంసి సుజాత, సిఒ రోజా ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న బ్యాంకుతో మాట్లాడి ఐదు రోజుల్లోనే కమలకు లక్ష రూపాయల వ్యాపార రుణం అందజేశారు. త్వరలో కమలతో కూరగాయల వ్యాపారం ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేశారు. కలెక్టర్ దివ్యాంగురాలికి ఇచ్చిన మాటను మరిచిపోకుండా అమలుపరిచినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు

బ్యాంకర్ల సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా బ్యాంకర్లు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు సకాలంలో రుణాలు అందించి ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలన్నారు. 2024–25 వార్షిక రుణ ప్రణాళికలో సెప్టెంబర్ 2024 వరకు రూ.2722.66 కోట్లు స్వల్పకాలిక పంట రుణాలుగా అందించడం జరిగిందన్నారు. వ్యవసాయ టర్మ్ రుణాలుగా వ్యవసాయ రంగానికి రూ.1239.55 కోట్లు బ్యాంకుల ద్వారా ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. వ్యవసాయ రుణాలను సకాలంలో అందించి లక్ష్యాలను సాధించాలని, రైతులు పంట రుణాలు సకాలంలో చెల్లించేలా అధికారులు క్షేత్రస్థాయిలో శ్రద్దకనబర్చాలన్నారు. సూక్ష్మ రుణాల కింద రూ.1216. 65 కోట్లు, విద్యా రుణాలు రూ. 17.53 కోట్లు, గృహ రుణాలు రూ.57.09 కోట్లు అందించడం జరిగిందన్నారు. ప్రాధాన్యతరంగాలకు మొత్తంగా రూ.5928.38 కోట్లు అందించడం జరిగిందని, అప్రాధాన్యత రంగాలకు రూ. 2265 కోట్లు అందించినట్లు తెలిపారు. మొత్తం జిల్లాలో రూ.8193.38 కోట్లు సెప్టెంబర్ 2024 వరకు బ్యాంకుల ద్వారా అందించినట్లు ఆయన తెలిపారు. ఎస్సి, ఎస్టి లబ్దిదారులకు సకాలంలో రుణాలను అందజేసి వారికి ప్రయోజనం కల్పించాలన్నారు. జిల్లాలో 764 మహిళా సంఘాలకు 2024–25 సంవత్సరానికి రూ. 11074.30 లక్షల బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పటి వరకు అందించామన్నారు. పిఎంఈజిపి, పిఎంఎఫ్, ఎంఈ రుణాలు లబ్దిదారులకు సకాలంలో అందించాలన్నారు. పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి లబ్దిదారులకు కిసాన్ క్రెడిట్ రుణాలు సకాలంలో ఇవ్వాలన్నారు. రిజర్వు బ్యాంక్ సూచనల మేరకు నూరు శాతం ప్రజలకు డిజిటల్ సేవలు అందించేలా కృషి చేయాలన్నారు. బ్యాంకులు ప్రజలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎల్‌డిఎం శ్రీనివాసరెడ్డి, ఆర్‌బిఐ ఎల్‌డిఓ సాయితేజ రెడ్డి, నాబార్డ్ డిపిఎం సుజిత్‌కుమార్, యుబిఐ డిజిఎం హన్మంతరెడ్డి, ఎస్‌బిఐ సిఎం వెంకటేశ్వరరావు, ఏపిజివిబి సిఎం శ్రీహరి, డిసిసిబి సిఇఒ ఎన్‌వి ఆదిత్య, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి విజయలక్ష్మి, ఇంచార్జి ఇడి ఎస్‌సి కార్పోరేషన్ నవీన్‌బాబు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ స్వాతంత్ర్యానికి పోరాడిన పార్టీ సిపిఐ




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సిపిఐ పార్టీ పురుడు పోసుకుని 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్బంగా ఈనెల 26న ఖమ్మంలో, డిసెంబర్ 30న నల్లగొండలో జరిగే శత వసంతాల ఉత్సవాలు, బహిరంగ సభలను విజయవంతం చేయాలని ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు., శుక్రవారం పట్టణంలోని తాపీ వర్కర్స్ భవన్‌లో సిపిఐ సత్తుపల్లి నియోజకవర్గ సమావేశం టౌన్ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సింగ్/నర్సింహారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, రైతు సంఘం నాయకులు జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్బంగా దండి సురేష్ మాట్లాడుతూ అనాడు సంపూర్ణ స్వాతంత్ర్యానికి పోరాడిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. కార్మికులు, కర్షకుల పక్షాన పోరాటాలు చేసి వారి హక్కుల సాధనలో సిపిఐ పార్టీ చరిత్ర పుటల్లో నిలుస్తుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించి దున్నే వాడికే భూమి కావాలని పోరాడి తెలంగాణలో పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ వంద వసంతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు , కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.




**మణుగూరు :** సిపిఐ శత వసంతాల ఉత్సవాలు, బహిరంగ సభలను విజయవంతం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఐ కార్యాలయంలో మండల, పట్టణ కౌన్సిల్, ముఖ్యుల సమావేశం జక్కుల రాజబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడుతూ పేద ప్రజల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం నిరంతరం సిపిఐ పనిచేస్తుందని, దున్నే వానికే భూమి కావాలని, తెలంగాణ సాయుధపోరాటం నడిపి, వేలాది ఎకరాల ను పేదలకు భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, ఎందరో కమ్యూనిస్టు యోధులు ఈ పార్టీ కోసం తమ ప్రాణాలు త్యాగం చేశారని, వారిని స్ఫూర్తి గా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డిలు మాట్లాడుతూ డిసెంబర్ 26 న గ్రామాలలో పార్టీ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు, లక్ష్మీ నారాయణ సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు ఎస్‌కే సర్వర్, ఎడారి రమేష్, గడ్డం వెంకటేశ్వర్లు, కమిసెట్టి రామారావు, లక్ష్మ య్య, తోట రమేష్, కొత్తపల్లి సీతారాములు, బోలగాని సమ్మక్క, కావ్య రెడ్డి సుజాత, లక్ష్మి , ఆగమ్మ, వజ్రా వెంకటేశ్వర్లు, కనితి సత్యనారాయణ, తూపుడు శ్రీను, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బిజెపి అత్యంత ప్రమాదకరం

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



**ప్రజాపక్షం/ఖమ్మం/ఇల్లందు :** భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అమమానించేలా మాట్లాడిన అమిత్‌షా కేంద్ర హోం శాఖ మంత్రిగా అర్హత కోల్పోయారని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఆయన వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బిజెపి అత్యంత ప్రమాదకరంగా మారిందని అందుకే కాంగ్రెస్‌తో కలిసి రాజకీయ ప్రయాణం చేస్తున్నామని స్పష్టం చేశారు. సిపిఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెంజిల్లా మూడవ మహాసభలు ఇల్లందులోని 24 ఏరియా సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. మహాసభను ప్రారంభించిన తమ్మినేని మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకే ఒకే ఎన్నిక విధానాన్ని తీసుకు రావాలని బిజెపి ప్రయత్నిస్తుందన్నారు. రాజ్యాంగాన్ని రూపుమాపడం కోసమే అమిత్‌షా ఉద్దేశ పూర్వక వ్యాఖ్యాలు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమిత్‌షా వ్యాఖ్యాలకు నిరసనగా బంద్‌కు పిలుపునివ్వాలని తమ్మినేని కోరారు. హిందుత్వ రాజ్యమే బిజెపి లక్ష్యమని ఆ క్రమంలోనే లౌకికవాదాన్ని, కార్మిక హక్కులను హరించివేస్తుందన్నారు. రాహుల్ గాంధీ అదానీని విమర్శిస్తుంటే రేవంత్‌రెడ్డి అదానితో ఒప్పందాలు చేయించుకుంటున్నారని దీనిని ఎలా అర్థం చేసుకోవాలన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని రుణమాఫీకి సంబంధించి రూ. 21వేల కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేశారని, నిరుద్యోగ భృతి సహా అనేక హామీలను పెడచెవిన పెట్టారన్నారు. సభలో బి. వెంకట్, పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, బండారు రవికుమార్, మీడియం బాబురావు, అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, కారం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్‌లో పోలీస్ టియర్‌గ్యాస్ మాక్‌డ్రిల్



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు, ప్రజలను ఇబ్బంది పెట్టేలా ధర్నాలు చేసినప్పుడు శాంతిభద్రతలు కాపాడడంలో పోలీసులు ముందస్తు చర్యలు ఎలా తీసుకోవాలో మాస్‌డ్రిల్ నిర్వహించారు. వజ్ర వాహనంతో టియర్ స్మోక్‌గ్యాస్ గ్రీనేడ్ ప్రయోగించారు. శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీస్ ఎలాంటి విధులు నిర్వహించాలి, వారిని ఎలా అదుపులో పెట్టాలి, గుంపులను ఎలా చెదరగొట్టాలనే అంశంపై మాక్ డ్రిల్, మాబ్ ఆపరేషన్ డ్రిల్ నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా ఎస్‌పి సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు సాయుధ అధికారులచే జిల్లా పోలీసు కార్యాలయంలో కొత్త పెరేడ్ గ్రౌండ్‌లో వజ్ర వాహనంతో టియర్ స్మాక్ గ్యాస్‌ను ప్రయోగించారు. ఎస్‌పి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా చాలా శాంతియుతమైన జిల్లా అని జిల్లా ప్రజలు కలిసిమెలిసి జీవిస్తారని అన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా ఇలాంటి డ్రిల్స్ నిర్వహించడం జరుగుతుందని ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పిలు శ్రీనివాస్, విజయ్, ప్రతాప్, ఆర్‌ఐలు అనిల్, సోములు, ఎస్‌బి సిఐ చంద్రమౌళి, టలాస్క్‌ఫోర్స్ సిఐ హతిరాం, ఎస్సై తహర్‌బాబా బెల్ ఆఫ్ ఆర్మ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్ఫేస్‌లో పనిచేస్తున్న కార్మికులకు అండర్ గ్రౌండ్ వేతనం చెల్లించాలి



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: సింగరేణిలో సర్ఫేస్‌లో పనిచేస్తున్న కార్మికులకు అండర్ గ్రౌండ్ వేతనం చెల్లించాలని కోరుతూ శుక్రవారం కెటికెవన్ ఇంక్లైన్‌లో ఎఐటియుసి ఆధ్వర్యంలో గని మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జి.శ్రీనివాస్, బి.కొమరయ్య, కె.సదయ్య, బి.రాజయ్య, బి.సేఫ్టీ కమిటీ, టెంపుల్ కమిటీ, కార్మికులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా కోర్టు ఎజిపిగా చంద్రశేఖర్

ప్రజాపక్షం/పాలకుర్తి: మండలంలోని వల్మిడి గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది చెరుకు చంద్రశేఖర్‌గౌడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. జనగామ జల్లా కోర్టు (ఎజిపి) అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది.ఈ మేరకు రాష్ట్ర న్యాయ వ్యవహారాల కార్యదర్శి ఆర్ తిరుపతి ఉత్తర్వులను జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ తనకు అప్పగించిన విధులను ఎలాంటి పక్షపాతం, తారతమ్యం లేకుండా నిర్వహిస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి, న్యాయాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎజిపి పదవి రావడానికి సహకరించిన పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సిరెడ్డిలకు ధన్యవాధాలు తెలిపారు.

## ఆర్‌టిసి ప్రయాణికులకు పువ్వులు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన అధికారులు



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: మర్యాద దినోత్సవం సందర్భంగా ఆర్‌టిసి ప్రయాణికులకు జనగామ డిపో మేనేజర్ ఎస్ స్వాతి ఆధ్వర్యంలో పూలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం జనగామ బస్టాండ్‌లోని ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణికుల్ని కలిసి పూలు అందజేశారు. ప్రయాణికులే ఆర్‌టిసి ఆస్తి, అందుకే వారిపై గౌరవంతో పూలు ఇచ్చి మళ్లీ మళ్లీ ప్రయాణించాలని శుభాకాంక్షలు తెలపడం జరిగిందన్నారు. మహిళా ఉద్యోగులతో పాటు అనేక మంది ఆర్‌టిసి బస్సుల్లోనే ప్రయాణించడం జరుగుతుందన్నారు. జనగామ నుండి బచ్చన్నపేట, ఓబుల్ కేశవాపూర్ వెళ్తున్న పలువురు టీచర్లు ప్రతి రోజు ఆర్‌టిసి బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారన్నారు. కొందరు హైదరాబాద్ నుండి సైతం జనగామకు వచ్చి వెళ్తున్నారన్నారు. వీరందరికి ఆర్‌టిసి అధికారులు అభినందనలు తెలిపారు.

## కేంద్ర హోం మంత్రి అమిత్ షాను పదవినుంచి బర్తరఫ్ చేయాలి

### హనుమకొండలో ప్రజాస్వామిక సంస్థల డిమాండ్

ప్రజాపక్షం/హనుమకొండ : హనుమకొండ అంబెడ్కర్ సెంటర్‌లో హనుమకొండ జిల్లా ప్రజాస్వామిక సంస్థల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ ను చట్టసభలోనే అవమానపరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ప్రభుత్వమే మంత్రి పదవినుండి భర్తరఫ్ చేయాలని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య మాట్లాడుతూ చర్చించాల్సింది రాజ్యాంగం గురించి అనే విషయాన్ని పక్కనబెట్టి అంబేడ్కర్ ను హేళనగా అవమానపర్చడం సిగ్గుచేటని క్షమాపణ చెప్పాలన్నారు. అభ్యదయ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ మాట్లాడుతూ అంటెడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారమే ఎన్నికై, దాని మీదనే ప్రమాణం చేసి అంటెడ్కర్ ను అవమానపర్చడం అంటే భారత జాతినే అవమానపరిచినట్లని ఇప్పటికే భారత రాజ్యాంగానికి భిన్నంగా ఈ పాలకులు నిర్ణయాలు చేశారని, ఇంకా చేస్తూనే ఉన్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను పటిష్టం చేయాల్సింది పోయి వాటి అమ్మకమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నారని, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసారని ఇది దేశానికి ప్రమాదమని అన్నారు. హనుమకొండ భారత్ బదావో చైర్మన్ డా.ఎం.వెంగల్ రెడ్డి మాట్లాడుతూ పాసిస్టు పోకడలతో పాలకులు ప్రవర్తిస్తున్నారని, చట్టసభలోనే అంటేడ్కర్‌ను అవమానపరిచడం ఫాసిస్ట్ పోకడినని, ఇప్పటికీ రాజ్యాంగాన్ని ప్రమాదంలో పడవేశారని అన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యకులు డా. మండ సదాలక్ష్మి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ ఇప్పటికే రాజ్యాంగాన్ని అస్థిర పరిచారని, మనువాదాన్ని అన్నిరంగాల్లో అమలు చేస్తున్నారని అన్నారు. బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, అరసం రాష్ట్ర నాయకులు వీరాస్వామి, భిక్షపతి, డెమొక్రాటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, ప్రొఫెసర్ వీరాస్వామి,మా నవ హుక్కుల వేదిక నాయకులు హరికృష్ణ, అడ్వకెట్ రవీందర్, తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకురాలు రమాదేవి, వరంగల్ భారత్ బచావో చైర్మన్ ప్రవీణ్ కుమార్, ఎచ్.ఆర్. ఎఫ్. నాయకులు దిలీప్ ప్రసంగించారు. ఉప్పలయ్య, కరేటి శంకర్ రావు, సొరం వెంకటేశ్వర్లు, బాదావత్ రాజు, మద్దెల కుమారస్వామి, రావుల రమేష్, రాజ్ మహమ్మద్, నర్మద తదితరులు పాల్గొన్నారు. నిరసన కార్యక్రమంలో సభికులంతా హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని, భర్తరఫ్ చేయాలనీ, భారత రాజ్యాంగం వర్ధిల్లాలని, మనువాదం నశించాలని, అంబేడ్కర్ ఆలోచనావిధానం వర్ధిల్లాలని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని దిక్కులు పిక్కటిల్లేలా నిందించారు.

# పక్కాగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని, లబ్ధిదారుల వివరాలను మొబైల్ యాప్లో నమోదు చేయడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి మొబైల్ యాప్లో నమోదు చేస్తున్నారు. శుక్రవారం వరంగల్ పట్టణంలోని 18వ డివిజన్ లేబర్ కాలనీ ప్రాంతంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఒక్క దరఖాస్తును వదలకుండా సర్వే చేయాలని ఆదేశించారు. సర్వేపై దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం అందించాలని, ప్రజలు సైతం అవసరమైన డాక్యు మెంట్లను సిద్ధం చేసుకొని సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్‌లతో సహకరించాలని సూచించారు.ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలు నమోదుకు ఎంత సమయం పడుతోంది.. రోజుకు ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు.. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని అధికారులను అడిగారు. ప్రతిరోజు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఎన్యుమరేటర్లు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు సర్వే పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని.. తప్పిదాలకు తావులేకుండా వివరాలు సేకరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు సర్వే పారదర్శకంగా జరిగేలా సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ తనిఖీలలో కలెక్టర్ వెంట కార్పొరేటర్ వస్కుల బాబు, జిల్లా పరిషత్ సిఇఒ రామిరెడ్డి, జిడబ్ల్యూ ఎంసి కాశిబుగ్గ సర్కిల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సంబంధితఅధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం పర్యటనలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కాళేశ్వరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపి రిజిస్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని ఇన్ పేషెంట్ వార్డు, డ్రగ్ స్టోర్ లను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పైకప్పు లికేజి అవుతుందని,మరమ్మత్తులు చేయించాలని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సిబ్బంది సమయ పాలన పాటిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, తహసిల్దార్ కృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు,డాక్టర్ సుస్మిత, ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాల్టీగా స్టేషన్ ఘనపూర్

### ప్రభుత్వానికి కడియం కృతజ్ఞతలు

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :జనగామ జిల్లాలోని స్టేషన్‌ఘనపూర్ గ్రామ పంచాయతీ ఇక మున్సిపాల్టీగా మారింది. శుక్రవారం అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. ప్రభుత్వ ప్రకటన పట్ల స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అభినందనలు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనగామ ఒకే ఒక మున్సిపాల్టీగా ఉండగా ఆ తరువాత నర్సంపేట, భూపాలపల్లి, మహబూబాబాద్, పరకాలలు మున్సిపాల్టీలుగా ఏర్పడ్డాయి. స్టేషన్‌ఘనపూర్, శివుణిపల్లి గ్రామ పంచాయతీలను కలుపుతూ మున్సిపాల్టీ చేయాలని గత కొన్ని రోజులుగా పట్టుపడుతుండగా గతంలో తాటికొండ రాజయ్య, ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి సైతం హామీ ఇచ్చారు. మున్సిపాల్టీ కోసం కడయం శ్రీహరి చేయని ప్రయత్నం లేదు. రాష్ట్రంలో పలు ప్రాంతాలను మున్సిపాల్టీలుగా మారుస్తున్నట్లు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు కొత్త మున్సిపాల్టీలు ఏర్పాడు కాగా స్టేషన్‌ఘనపూర్‌ను సైతం మున్సిపాల్టీగా ప్రకటించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ స్టేషన్‌ఘనపూర్ అభివృద్ధికి ప్రభుత్వం అనేక విధాలుగా సహకరిస్తుందన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందని, స్టేషన్‌ఘనపూర్‌ను మున్సిపాల్టీగా ప్రకటించినందున మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## బిసిలను రాజ్యాధికారం వైపు నడిపించేందుకే 'బిసి హక్కుల సాధన సమితి'

### బిసి హక్కుల సాధన సమితి వరంగల్ ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి



ప్రజాపక్షం/వరంగల్ : బిసిలను రాజ్యాధికారం వైపు నడిపించేందుకే 'బిసి హక్కుల సాధన సమితి' ఉందని బిసి హక్కుల సాధన సమితి వరంగల్ ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. బిసి హక్కుల సాధన సమితి వరంగల్ మండల్ మహాసభ గాంధీనగర్ గ్రీన్ సిటీ వరంగల్‌లో శుక్రవారం బచ్చల స్వప్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారస్వామి మాట్లాడుతూ వెనక్కి నెట్టివేయబడ్డ బిసి కులాలను ఆర్థిక సామాజిక రాజకీయ రంగాలలో తమ వాటా సాధించుకునే దిశగా చైతన్య పరచే బాధ్యతను బిసి హక్కుల సాధన సమితి తీసుకుంటుందని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో తెలంగాణ బిసి హక్కుల సాధన సమితి బలమైన నిర్మాణ సంఘంగా అవతరించి, ఉత్పత్తి శక్తులైన బిసిలను రాజ్యాధికారం వైపు నడిపిస్తుందని అన్నారు. సకల రంగాల్లో తమ వాట సాధించుకోవాలంటే మోడీ నాయకత్వాన ఉన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే దేశంలో కులగణన జనగణన చేయాలని, ఈ కుల గణన జనగణన లెక్కల ప్రకారం ఎవరి వాటా వారికి ఇవ్వాలని, ఆ రకంగా బిసిల జనాభా నిష్పత్తి ప్రకారం విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలతో పాటు స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంటు, స్థానాలలో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంతేకాదు అన్ని రాజకీయ పార్టీలు తమ కమిటీలలో బిసిలకు వారి నిష్పత్తి ప్రకారం స్థానం కల్పించాలన్నారు.సామాజిక న్యాయం గురించి మాట్లాడే ప్రతీ రాజకీయ పార్టీ మొదటి తమ కమిటీలలో సామాజిక వర్గం పొందిక పాటించాలన్నారు. హిందూ మతానికి బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకుంటున్న బిజెపి, మోదీ ప్రభుత్వం హిందూ మతంలోని బిసి కులాలను ఎందుకు లెక్కించడం లేదని ప్రశ్నించారు, ఆరు శాతం ఉన్న అగ్రకులాలలోని వారికి ఏ ప్రాతిపదికన 10 శాతం రిజర్వేషన్లను 103వ రాజ్యాంగ సవరణ చేసి ఇచ్చారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు వలబోజు వెంకన్న మాట్లాడుతూ బిసి హక్కుల సాధన సమితి విస్తృతంగా కార్యక్రమాలు చేయబడుతుందని అందులో భాగంగానే డిసెంబర్ 25 తేదీన నిచ్చెన మెట్ల వ్యవస్థను నిర్మించి బిసిలను దళితులను గుడికి బడికి దూరం చేసిన మనస్మృతిని దగ్ధం చేసే కార్యక్రమాన్ని తీసుకున్నామన్నారు .ఈ మహాసభలో గౌరవ అధ్యక్షుడు పరికరాల రమేష్, అధ్యక్షుడు ఆరె రాజు, ఉపాధ్యక్షురాలు బచ్చలి స్వప్న, ప్రధాన కార్యదర్శి మేడిద అశోక్, సహాయ కార్యదర్శి యార మల్లయ్య పోనుగోటి చారి,నారాయణ తంగళ్ళపల్లి లక్ష్మి , చంద్రశేఖర, మార్కండేయ,పేర్ల సురేష్, రాము, ఓరుగంటి ఉపేంద్ర సభ్యులుగా ఎన్నికయ్యారు.

## క్షేత్రస్థాయిలో వసతిగృహాలు తనిఖీ

### జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: ఇందిరమ్మ ఇండ్ల సర్వే పక్కాగా క్షేత్రస్థాయిలో నిర్వహించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. శుక్రవారం జిల్లాలో విస్తృతంగా సుడిగాలి పర్యటన చేశారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే, పాఠశాలలు, వసతిగృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కేసము ద్రం మండలం కల్వల మోడల్ స్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిసత్ ఉన్నత పాఠశాల, కేసముద్రం ఇందిరమ్మ ఇండ్ల సర్వే, పెనుగొండ, బోడమచ్చ తండాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ చేసి హాజరుపట్టిక, మందుల స్టాక్ రిజిస్టర్, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సి పరిధిలో ఎలాంటి అ నారోగ్య సమస్యలు రాకుండా ప్రతి రోజు షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు, శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని సూచించారు. జెడ్‌పి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తున్న కిచెన్ గదిని స్వయంగా సందర్శించారు. పిల్లలకు నాణ్యమైన రుచిక ర భోజనం అందించాలని, నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. విద్యార్థులతో మాటాడుతూ చదువుపై ఆసక్తితో ఉండాలని కే వలం విద్య ద్వారానే ఏదైనా సాధించవచ్చని విద్యార్థినీ విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎ.రవీందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు ఉన్నారు.

## టిఎన్‌జిఓఎస్ యూనియన్ కార్యాలయం ప్రారంభం



ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి: టిఎన్‌జిఓస్ యూనియన్ ములుగు జిల్లా కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో ములుగు టిఎన్జీఓస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోలు రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ ఉద్యోగస్తులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను అమలు పరుచుటలో ముందంజలో ఉండి జిల్లాను ప్రథమ స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలని కోరారు. ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా మీ వెంటే ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం పోలు రాజు మాట్లాడుతూ కలెక్టర్ యూనియన్‌కు ఈ భవనాన్ని కేటాయించినందుకు, కలెక్టర్, స్వయంగా వచ్చి ప్రారంభించినందుకు వారికి ఉద్యోగులందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్జిఓస్ యూనియన్ కార్యదర్శి మేడి చైతన్య, టిఎన్జిఓస్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ షఫీ సర్కార్, కోశాధికారి భూక్యలాల్ నాయక్, కుమారస్వామి, వైస్ ప్రెసిడెంట్, జా యింట్ సెక్రటరీ శ్రీధర్, రాంగోపాల్, సునీత, శ్రీవాణి, సరిత, జైసింత, ఆర్గనైజ్ సెక్రటరీ ప్రదీప్ అనిల్, ప్రశాంత్, ఉదయ్ కుమార్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, సిహెచ్ రాజు, భాస్కర్, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్‌యార్డు గదుల పరిశీలన



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: శిథిలావస్థలో ఉన్న మహబూబాబాద్ మార్కెట్‌యార్డు కార్యాలయం గదులను శుక్రవారం చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, వైస్ చైర్మన్ మదన్‌గోపాల్ పరిశీలించారు. సుమారు 50సంవత్సరాల క్రితం నిర్మించిన మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం శిధిలావస్థకు చేరుకోవడంతో కనీస అవసరాలకు పనిచేస్తుందో లేదో అని వాటిని గుర్తించేందుకు చైర్మన్, వైస్ చైర్మన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఐదు దశాబ్దాల క్రితం నిరమించిన మహబూబాబాద్ వ్య వసాయ మార్కెట్ కార్యాలయం పూర్తిగా శిధిలావస్థకు చేరుకుని పైనుండి స్లాబ్ డి పడుతూ ఉండంతో పాటు కార్యాయలం పూర్తిగా శిధిలావస్థకు చేరుకుందని వారు గుర్తించారు. పరిస్థితిని అదికారులకు వివరించారు. దీంతోపాటు రైతులకోసం ఏర్పాటుచేసిన రైతు విశ్రాంతి భవనం, దదువాయిల కార్యాలయం సైతం వారు పరిశీలించారు. త్వరలోనే మార్కెటింగ్ శాఖ, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాంనాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌తో సంప్రదించి మార్కెట్ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు వారు తెలిపారు.

## కాజీపేటలో ఘనంగా సిపిఐ వార్షికోత్సవాలు



ప్రజాపక్షం/కాజీపేట : హనుమకొండ జిల్లాలోని కాజీపేట్ మండలంలో ఆరుట్ల రామచంద్రారెడ్డి కాలనీ, ఎఆర్‌ఆర్ కాలనీలో సిపిఐ 99వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఐ జిల్లా సమితి సభ్యురాలు రాస మల్ల దీన అధ్యక్షతవహించగా ఈ సందర్భంగా సిపిఐ కాజీపేట మండల కార్యదర్శి మునిగాల బిక్షపతి ఎర్రజెండాను ఎగురవేసి పార్టీ వ్యవస్థాపక దినోత్సవం ఇప్పటికీ 99 సంవత్సరాలను పూర్తి చేసుకొని వంద నిర్వహిస్తున్నారని కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎలేష్, సిపిఐ కాజీపేట మండల సహాయ కార్యదర్శి మాలో శంకర్ నాయక్, బండ్లోజు రాజమణి, రామంచ మన్నెమ్మ, పోగుల జ్యోతి, హనుమకొండ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రాస మల్ల కుమార్, శంకర్పల్లి యాదగిరి, ఎస్ సరూప వాస్కుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మడికొండ లోని ఖండాల దాబా రావి నారాయణరెడ్డి కాలనీ లో సిపిఐ 99వ వార్షికోత్సవాల ఎర్ర జెండాను సిపిఐ జిల్లా సమితి సభ్యురాలు రాస మల్ల దీన ఎగురవేసినారు. ఆర్ ఎన్ ఆర్ కాలనీ కార్యదర్శి గుగులోతు రమేష్ , బీసరూప భారత్ మానెమ్మ మమత ప్రణీత, జట్పాట్ వీరస్వామి ముప్పిడి కృష్ణ మాలోత్ కమల హారిక తదితరులు పాల్గొన్నారు. మండలంలో నీ రాంపూర్ గ్రామం నందు సిపిఐ 99వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాజీపేట్ సిపిఐ మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ హాజరై సిపిఐ జెండాను ఎగరవేసినారుఈ కార్యక్రమంలో సిపిఐ కాజీపేట మండల సహాయ కార్యదర్శి మాలోత్ శంకర్ నాయక్, సిపిఐ శాఖ కార్యదర్శి మంద సుమన్, నాయకులు మునగాల ఐలయ్య, దామర వెంకటయ్య కొయ్యడ కుమార్ మేకల మనోహార్ ఇల్లందుల పద్మ, లకావత్ లక్ష్మి , మారగోని వరలక్ష్మి , మునగాల రజిత, గడ్డం స్రవంతి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాంపూర్ గ్రామం హనుమంతరావు స్తూపం వద్ద సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి మంద సుమన్ ఎర్రజెండాను ఎగరవేసినారు. బొంతుగుట్ట 347 సర్వే నంబర్ భూ పోరాట కేంద్రం వద్ద సిపిఐ జెండాను ఎగురవేశారు.

## అలుపెరుగని వీరుడు అమరజీవి మంచాల తిరుపతి

### బికెఎంయు జాతీయ నాయకులు మోతే లింగారెడ్డి



ప్రజాపక్షం/భీమదేవరపల్లి : సమాజంలో సమూల మార్పులు జరిగి పేదలకు రాజ్యాధికారం రావాలని చెప్పి తెలంగాణలో సాయుధ పోరాటం కొనసాగుతున్న సందర్భంలో భీమదేవరపల్లి వంగర గ్రామంలో మిలిటెంట్‌గా పోరుబాట పట్టిన మంచాల తిరుపతి అమరుడని, అతని ఆశయం మనిషిని మనిషి దోపిడీ చేయనటువంటి సోషలిజాన్ని సాధించడం ధ్యేయంగా పోరాడిన వీరునికి మరణము లేదని బీకేఎంయు జాతీయ నాయకులు మోతే లింగారెడ్డి అన్నారు. వంగర గ్రామంలో తిరుపతి చిత్రపటం వద్ద ఘనంగా నివాళులు అర్పించి లింగారెడ్డి మాట్లాడుతూ మారుమూల గ్రామంలో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించినప్పటికీ మహోన్నతమైన ఆశయంతో ప్రజా పోరాటాలలో తన చివరి శ్వాస వరకు నిలిచి పోరాడిన విప్లవ వీరుడు మంచాల తిరుపతి అని కొనియాడినారు. అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితుడై పార్టీలో అనేక ప్రజాసంఘాలలో జిల్లా నేతగా బాధ్యతలు నిర్వర్తిస్తూ హనుమకొండ జిల్లా సిపిఐ సమితి సభ్యులుగా,ఆయన సతీమణి మంచాల రమాదేవి భారత జాతీయ మహిళా సమాఖ్య హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న నేపథ్యాన్ని వారి కుటుంబ త్యాగనిరతికి నిదర్శనంగా పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం పరిరక్షింపబడాలన్న రాజ్యాంగం అమలు కావాలన్నా లౌకికవాదాన్ని నిలుపుకోవాలన్న ఒకే దేశం ఒకే ఎన్నిక జమిలీ ఎన్నికలు అని ప్రజలపై నిర్బంధ ఖండం కొనసాగిస్తున్న పాలకవర్గాలని ప్రజల్లో నిలబెట్టడానికి పోరాటాల్లో భాగస్వాములు కావడమే నిజమైన నివాళులు అర్పించిన వాళ్ళమని నేదునూరి రాజమౌళి బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు నివాళులర్పించిన సందర్భంలో మాట్లాడుతూ పేర్కొన్నారు. కార్యక్రమంలో మంచాల తిరుపతి సహచరురాలు రమాదేవి, లక్ష్మి , ప్రియాంక, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ప్రజాపక్షం/రఘునాథపల్లి: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులకు తెలియజేయడం జరిగింది. శుక్రవారం మండలంలోని రఘునాథపల్లి, ఖిలాషాపురం గ్రామ పంచాయితీల పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల సమగ్ర సర్వేను అధికారులు నిర్వహిస్తుండగా జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సర్వే జరుగుతున్న తీరును స్వయంగా వెళ్లి పరిశీలించి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులతో కలెక్టర్ స్వయంగా వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సమగ్ర సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని చెప్పడం జరిగింది. తహసీల్దార్ మహ్మద్ మోసిన్, ఎంపిడిఒ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

## కులగణనకు ప్రదాన అడ్డంకి బిజెపి



ప్రజాపక్షం/కొడకండ్ల: దేశవ్యాప్త కులగణనకు కాంగ్రెస్ పార్టీ కృతనిశ్చయంతో ఉంటే కేవలం భారతీయ జనతా పార్టీ మాత్రమే ప్రధాన అడ్డంకిగా మారిందని ప్రముఖ బిసి నాయకులు, కాంగ్రెస్ కొడకండ్ల పట్టణ శాఖ అధ్యక్షులు మసురం రవీందర్ నేత అన్నారు. తెలంగాణ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16, 17, 18 తేదీలలో దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంత ర్ ధర్నా చౌక్‌లో జరిగిన ధర్నాలో స్థానిక బిసి నాయకుడు దేశగాని నాగరాజుతో కలిసి రవీందర్ మూడు రోజుల పాటు ధర్నా నిర్వహించారు. శుక్రవారం స్వగ్రామానికి విచ్చేసిన రవీందర్ విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో పార్లమెంటులో సహకరించడానికి రాహుల్‌గాంధి సిద్ధంగా ఉన్నారని బిజెపి తన వైఖరిని ప్రదర్శించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని బిజెపిని హెచ్చరించారు. మూడు రోజుల పాటు జంతర్‌మంతర్‌లో ఎముకలు కొరికే చలిలో వందలాది మంది బిసి ప్రతినిధులు ధర్నా నిర్వహిస్తే బిజెపికి చెందిన బిసి ఎంపిలు ఎవరు కూడా కనీసం సంఘీభావం కూడా తెలుపలేదని మండిపడ్డారు. కుల, జన గణన చేపడితే బిసిలకు భవిష్యత్తులో అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టి కుల గణనకు అనుకూలంగా ఉందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు కులగణన తర్వాతే నిర్వహిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాను ఢిల్లీలో తెలంగాణ బిసి సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్‌తో పాటు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, ఎంపిలు అప్పలనాయుడు, డి రాజా తదితరులను కలవడం జరిగిందన్నారు. రాజ్యసభ ఎంపి ఆర్ కృష్ణయ్యను కలవగా ఢిల్లీకి వచ్చి బిసిల పక్షాన పోరాడడం అభినందించడం జరిగిందన్నారు.

# 'కరీంనగర్'లో 6 గ్రామాల విలీనం

### మంత్రి పొన్నం ప్రతిపాదనకు సర్కారు ఓకే
### పన్ను మినహాయింపు కోరుతున్న గ్రామాల ప్రజలు




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** కరీంనగర్ సిటీ మరింత విస్తరించనుంది. కరీంనగర్ కార్పోరేషన్‌లో సిటీని ఆనుకున్న ఆరు గ్రామాలను విలీనం చేయాలన్న జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపాదనకు ప్రభుత్వం ఓకే చెప్పింది. ఈ మేరకు కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్, కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్, చింతకుంట, లక్ష్మీపూర్ గ్రామాలను కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్‌లో విలీనం చేస్తూ క్యాబినెట్ ఆమోదించింది. మూడు నెలల క్రితం మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఆరు గ్రామాల విలీనం చేయాలని లేఖ రాశారు. ఈ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు తాగునీరు, రోడ్లు వంటి సౌకర్యాలు కల్పించడం అత్యవసర విలీనానికి సంబంధించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని లేఖలో ఆయన జిల్లా యంత్రాంగాన్ని అభ్యర్థించారు. ఈ మేరకు శుక్రవారం సర్కారు ఆమోదించింది. అధికారికంగా సర్క్యులర్ రానప్పటికీ గురువారం అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు ప్రవేశపెట్టిన అంశాల్లో కరీంనగర్‌లో విలీనం చేసిన ఆరు గ్రామాల ప్రతిపాదన ఉంది. దీంతో శుక్రవారం కరీంనగర్ కార్పోరేషన్‌లో అట్టి ఆరు గ్రామాలను విలీనం చేస్తూ ఆమోదించినట్లు జిల్లా యంత్రాంగానికి మూఖీగా సమాచారం అందింది. ఈ క్రమంలో గ్రామాలను కరీంనగర్ కార్పోరేషన్‌లో విలీనం చేయడంతో డివిజన్ల పునర్విభజన జరగనుంది. కరీంనగర్ పట్టణం 1958లో మున్సిపాలిటీగా అవిర్భవించగా 1987లో గ్రేడ్ 1 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. ఆ తర్వాత జనాభా పెరగడం, పట్టణం క్రమంగా విస్తరించడంతో 2005లో మున్సిపల్ కార్పోరేషన్‌గా అప్పటి ప్రభుత్వం గుర్తించింది. కార్పోరేషన్ అయ్యాక రెండు దశాబ్దాల్లో అనూహ్యంగా విస్తరించింది. వేగంగా పెరిగి అర్బనైజేషన్‌తో చుట్టూ ఉన్న సుమారు 12 గ్రామాలు ఇందులో కలిసిపోయాయి. ఈ క్రమంలోనే కరీంనగర్ కార్పోరేషన్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద ఎంపికయ్యాక 2019 జూన్‌లో పక్కనే ఉన్న పద్మనగర్, రేకుర్తి, సీతారంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, అల్గునూర్, సదాశివపల్లి, గ్రామాలను బల్దియాలో విలీనం చేశారు. 2020 జనవరిలో విలీన గ్రామాలను కలిపి 50 వార్డులను 60 డివిజన్లుగా విభజించి ఎన్నికలు నిర్వహించారు. దూరంగా ఉన్న సదాశివపల్లి ,వల్లంపహాడ్, అల్గునూర్‌ను విలీనం చేసినప్పటికీ అప్పటికే సిటీలో పూర్తిగా బొమ్మకల్, చింతకుంట, మల్కాపూర్, లక్ష్మీపూర్, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాలను బల్దియాలో కలపాలనే డిమాండ్ చాలా కాలంగానే ఉంది. తాజాగా విలీనం చేయడంతో కరీంనగర్‌లోని 60 డివిజన్లను పునర్విభజించి మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే త్వరలోనే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా గ్రామాల ఆశావహుల ఆశలు ఆవిరయ్యాయని చర్చించుకుంటున్నారు. ఇదే క్రమంలో కార్పోరేషన్‌లో గ్రామాలను విలీనం చేయగా బల్దియా పన్నులను మినహాయంపు ఇవ్వాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. విలీనం జరిగితే అభివృద్ధి జరుగుతుందని కొందరు.. నష్టమే ఎక్కువ జరుగుతుందని మరికొందరు తమ అభిప్రాయాలు చెబుతున్నారు.

## నేను తప్పు చేశాను..మీరు చేయకండి!



**ప్రజాపక్షం/గోదావరిఖని :** డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 8 మంది వ్యక్తులకు గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ శుక్రవారం రూ.18 వేలు జరిమానా విధించారు. రెండోసారి పట్టుబడిన గోసిపాతల ప్రభుదాస్‌తో ఒక రోజు కమ్యూనిటీ సర్వీసింగ్ చేయించాలని పోలీసులకు ఉత్తర్వు ఇచ్చారు. ఈ మేరకు రామగుండం ట్రాఫిక్ సబ్ ఇన్స్‌పెక్టర్ జి.హరిశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు గోదావరిఖని మున్సిపల్ జంక్షన్ వద్ద ప్రభుదాస్‌తో ట్రాఫిక్ నియమాలు పాటించాలని వాహనదారులను కోరుతూ ప్లేకార్డులతో కమ్యూనిటీ సర్వీసింగ్ చేయించారు.

## పెద్దాపూర్ పాఠశాల పనుల పరిశీలన



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను శక్రవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్,ఆకస్మిక సందర్శించి పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణ పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలను పూర్తిస్థాయిలో తొలగించి గుంతలను పూడ్చి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. గ్రామపంచాయతి, మున్సిపల్ సంబంధించిన పాఠశాలలోని ఆవరణలో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి, విద్యార్థిని, విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే ఉపాధ్యాయుల తెలియజేయాలని సూచించారు. పరిశుభ్రత పై ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠినమైన చర్యలు తిసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. వారి వెంట ఆర్డిఓ శ్రీనివాస్, డిపిఓ రఘువరన్, ఎంపీడీవో, ఎమ్మార్వో, మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ పాల్గోన్నారు.

## తప్పిపోయిన బాలిక అప్పగింత



**ప్రజాపక్షం /వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణం లోని హరిహర ఫంక్షన్ హాల్ వద్ద రెండు సంవత్సరాల బాలిక హన్సిక మిస్సింగ్ అయింది. అయితే కోడిమ్యాల నుండి రమేష్ రమ్య దంపతులు నిన్నటి రోజున బందువుల పెళ్లి కోసం వేములవాడ కి వచ్చారు. రాత్రి బందువుల ఇంటి వద్దనే ఉండగా తెల్లవారు జమున బాలిక మిస్సింగ్ అయింది. అయితే ఆడుకుంటూ రోడ్డు దాటి ముందుకు చాలా దూరం వెళ్ళింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా దొరక లేదు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీస్‌లకి సమాచారం ఇచ్చారు. అయితే దర్యాప్తు లో భాగంగా ప్రభు అనే యువకుడి కి పాపం దొరకడంతో పోలీస్ స్టేషన్ లో అప్పగించాడు. తల్లిదండ్రులకి బాలిక ను అప్పగించారు.

## 'సింగరేణి' వేడుకలకు కసరత్తు



**ప్రజాపక్షం/గోదావరిఖని :** సింగరేణి ఆవిర్భావ దినోత్సవం వేడుకల సందర్భంగా ఆర్.సి.ఒ.ఎ. క్లబ్‌లో జానపద సాంస్కృతిక కార్యక్రమాలపై కళాకారులు శుక్రవారం సాధన చేశారు. సింగరేణి ఆర్జీ1సేవా అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్ , ఎస్వోటూ జీఎం గోపాల్‌సింగ్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సేవా కార్యదర్శి శిరీష, సేవా జాయింట్ సెక్రటరీ బినాసింగ్‌ల సమక్షంలో శిక్షకులు విద్యార్థులు, కళాకారులచే సాధన చేయించారు. 18 ప్రదర్శనలకు సంబంధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులను ఎంపిక చేసి ప్రధాన వేడుకల్లో ప్రదర్శన ఇచ్చేలా కార్యక్రమం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

## కొండపోచమ్మ వార్షిక ఆదాయం రూ.43.71 లక్షలు

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** శ్రీ కొండపోచమ్మ ఆలయం వద్ద ఈఒ రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం బహిరంగ వేలం పాటను నిర్వహించారు. ఈ వేలం పాటలో ఆలయ వార్షిక ఆదాయం రూ. 43. లక్షల 71వేలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ ఆదాయం ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు ఈఒ తెలిపారు.

## హరీష్, కౌశిక్‌రెడ్డిలపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేయాలి




**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** బిఆర్ఎస్ ఎంఎల్ఎలు హరీష్‌రావు, కౌశిక్‌రెడ్డిలపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసులు పెట్టి వారి సభ్యత్వాలు రద్దు చేయాలని టిపిసి రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేట అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ మధుకు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణ శాసనసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై సిద్దిపేట ఎంఎల్ఎ హరీష్‌రావు, పాడి కౌశిక్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి లు అనుచిత వ్యాక్యలు చేసి, అసభ్యంగా ప్రవర్తించారన్నారు. స్పీకర్‌ను అవమానపర్చిన ఎంఎల్ఎలు హరీష్‌రావు, కౌశిక్‌రెడ్డి, పల్ల రాజేశ్వర్‌రెడ్డిలపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్ వ్యవహారాల్లో తల దూర్చి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్న ఎంఎల్ఎలు హరీష్‌రావు, కౌశిక్‌రెడ్డి. రాజేశ్వర్‌రెడ్డిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్ దళిత వర్గానికి చెందిన వ్యక్తి కావటం సరైన గౌరవం ఇవ్వటం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పెట శంకర్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ చెలికాని యాదగిరి, ముస్త్యాల యాదగిరి, శ్రీనివాస్, శివగౌడ్, నాగరాజు, చేర్యాల బాలయ్య, బస్వరాజు రాములు, ముక్కెర లింగం తదితరులు పాల్గొన్నారు.

# నేత కార్మికుల ఆత్మహత్యలను అడ్డుకోండి

### ఎఐటియుసి పవర్ లూమ్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పంతం రవి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన యజమానుల అనుకూల విధానాల ఫలితంగా ప్రస్తుతం సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యల పరంపర కొనసాగుతుందని, గురువారం దూస గణేష్ అనే పవర్లూమ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేయాలని పవర్‌లూమ్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పంతం రవి డిమాండ్ చేశారు. శుక్రవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో ఎఐటియుసి అనుబంధ పవర్‌లూమ్ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం అజ్జ వేణు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగామాట్లాడారు. గత ప్రభుత్వం మాదిరిగా కొంతమంది యాజమాన్యాలకే లబ్ధి చేకూర్చడం సరైన విధానం కాదని సిరిసిల్లలోని కార్మికులు ఆసాములు ఎన్నో దశాబ్దాలుగా కలగంటున్న యారన్ డిపోను ఏర్పాటు చేసి నేరుగా ఆసాములకు తద్వారా కార్మికులకు లబ్ధి చేకూర్చాలనే సదుద్దేశంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం యారన్ డిపోను ఏర్పాటు చేసిందని యారం డిపో ఏర్పాటు చేయడం ద్వారా ఆసాములు స్వతహాగా ప్రభుత్వానికి అవసరమైన గుడ్డను ఉత్పత్తి చేయాలని దీని ద్వారా కార్మికులకుకూడా కూలి గిట్టుబాటు అవుతుందని అన్నారు. కొంతమంది యాజమాన్యాల వద్ద ఉన్న మ్యాక్స్ సంఘాలు ఎవరికి వారు ఆసాములు స్వతహాగా ఉత్పత్తి చేస్తారని ఆశించి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం యారన్ డిపో ఏర్పాటు చేస్తే గత ప్రభుత్వం హయాంలో అత్యధిక లాభాలు గడించిన కొందరు యజమానులు తిరిగి ఇప్పుడు తీరు మార్చుకోక ఆసాములను బెదిరింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. స్వతహాగా ఉత్పత్తులు చేస్తే ప్రభుత్వ ఆర్డర్లు అయిపోయిన తర్వాత మీకు బీములు ఇవ్వమని మీరు వారం వారము కార్మికులకు ఇవ్వాల్సిన కూలి ఇవ్వడం మీతోని కాదని మీరు స్వతహాగా ఉత్పత్తులు చే స్తే గతంలో ఇవ్వాల్సిన బకాయిలు మాకు ఇప్పుడే చెల్లించాలని భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. మీ పేరుపై ప్రభుత్వం నుండి ఆర్డర్లు తీసుకురండి కానీ గతంలో మాదిరిగా లాభాలను మాకే ఇవ్వాలని ఒత్తిడికి గురి చేస్తూ ఆసాముల నుండిప్రామిసరీ నోట్లు రాయించుకోవడం దుర్మార్గమైన చర్యా అని ఖండించారు. ఈ విషయాలపై చేనేత జోలి శాఖ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి యజమాను లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసాములు స్వతహాగా ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి ఇవ్వాలని యజమానులు ఒత్తిడికి లొంగిపోయి యజమానులు చెప్పిన విధంగా నడుచుకుంటే మీ మ్యాక్స్ సంఘాలను బ్లాక్ లిస్టులో పెడతారని ఎవరైనా యజమానులు ఒత్తిడికి గురి చేస్తే చేనేత జౌళి శాఖ అధికారులకు తెలపాలని అన్నారు. ఈ సమావేశంలో రాజు, సదానందం, నాగరాజు, నరసయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## మానేరు విద్యార్థులకు పతకాలు



**ప్రజాపక్షం/కరీంనగర్ః** జిల్లా క్రీడాశాఖ, ఒలంపిక్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న కరీంనగర్‌లో సీఎం కప్ 2024 జిల్లా స్థాయి వుషు చాంపియన్‌షిప్ పోటీల్లో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు సత్తా చాటినట్లు పీఈటి సిలివేరి మహేందర్ తెలిపారు. సబ్ జూనియర్ కేటగిరీలో పాఠశాలకు చెందిన 5 గురు విద్యార్థులు బంగారు పతకాలను , 8 మంది విద్యార్థులు రజత, కాంస్య పతకాలను సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీత రెడ్డి అభినందించారు. సీఎం కప్ జిల్లా స్థాయి ఉషు పోటీల్లో బంగారు పతకాలు సాధించడం అభినందయనీయమన్నారు. రాష్ట్ర పోటీల్లో సైతం చాంపియన్‌గా నిలిచి జిల్లా పేరును, పాఠశాల పేరును నిలపాలని సూచించారు. విద్యార్థులను మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, ప్రిన్సిపల్ సరితారెడ్డి, పిఈటిలు సిలివేరి మహేందర్, జహేద, శిరీష, తిరుపతి, స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## 22న ట్రినిటీ రామానుజన్ ఒలంపియాడ్ టెస్ట్–2024




**ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధిః** గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ట్రినిటీ జూనియర్ కళాశాలలు కరీంనగర్, పెద్దపల్లిల ఆధ్వర్యంలో ఈ నెల 22 ట్రినిటీ రామానుజన్ ఒలంపియాడ్ టెస్ట్ 2024 నిర్వహిస్తున్నట్లు కళాశాలఫౌండర్‌చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. పదవ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో గల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు డిసెంబర్ 10 నుంచి 18 వరకు లెవెల్ 1 పరీక్షను వారి వారి స్కూల్స్‌లో నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలో 12,356 మంది పాల్గొన్నారని, వారిలో 2368 విద్యార్థులు లెవల్ 2 పరీక్షకు అర్హత సాధించినట్లు తెలిపారు. వీరికి డిసెంబర్ 22న రామానుజం జయంతి సంధర్భంగా లెవెల్ 2 పరీక్ష కరీంనగర్ పట్టణంలోని ట్రినిటీ ప్రైమ్‌క్యాంపస్, ఏసి బాయ్స్ క్యాంపస్, ఏసి గర్ల్స్ క్యాంపస్‌లో నిర్వహిస్తారని తెలియజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డిసెంబర్ 25న ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్‌లో బహుమతి ప్రధానం నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.7,500, మూడో బహుమతి రూ. 5 వేలు, నాలుగో బహుమతి మూడు వేలు, ఐదవ బహుమతి రూ.2 వేలు, ఆరు నుంచి 10 ర్యాంకులు వరకు రూ.1500,20 మంది విద్యార్థులు వెయ్యి రూపాయల చొప్పున బహుమతి ప్రధానంతో పాటుగా మెడల్, మెమెంటో, ప్రశంసా పత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు.లెవెల్ 2 పరీక్షలో 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాలలో పదిశాతం నుంచి 100 శాతం వరకు ఫీజు రాయితీ ఇస్తామని తెలియజేశారు. కరీంనగర్ ట్రినిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# మరింత మెరుగ్గా మహిళా సంఘాల పనితీరు



పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష






**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** జిల్లాలో ఉన్న మహిళా సంఘాల పనితీరు మెరుగుపరిచేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.శుక్రవారం కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్వశక్తి మహిళా సంఘాలపై సంబంధిత అధికారులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో పాల్గొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూపెద్దపెల్లి జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి 9102 మహిళా సంఘాలకు సు మారు రూ.478 కోట్ల రుణాల మంజూరు చే యడం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 3898 సం ఘాలకు రూ.322 కోట్ల 68 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, నిర్దేశిత లక్ష్యంలో 67.51 శాతం రుణాలు మంజూరు చేసామన్నారు. ఎన్.పి.ఏలు అధికంగా ఉన్న సీసీలు ప్రత్యేక శ్రద్ధ వహించి నెల రోజులలో వాటిని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, అడిషనల్ డి ఆర్‌డిఓ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

**మార్చి నాటికి పట్టణ అభివృద్ధి**

పట్టణాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో మార్చి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీ పనితీరుపై అధికారులతో రివ్యూ సమావేశంలో పాల్గొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ పట్టణాలలో రోడ్ల పై చెత్త లేకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పట్టణాలలో ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ పూర్తి స్థాయిలో వసూలు చేయాలని, మున్సిపాలిటీలలో పని చేసే సిబ్బందికి జీతాల చెల్లింపు లేట్ కాకుండా చూడాలన్నారు. సుల్తానాబాద్ ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**42 పడకల ఆసుపత్రి భవనం తనిఖీ**

నూతనంగా నిర్మాణం చేపట్టిన 42 పడకల ఆసుపత్రి భవనాన్ని ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకు రావాలని కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణం అవుతున్న 42 పడకల ఆసుపత్రి భవనాన్ని తనిఖీ చేశారు. శ్రీ హర్ష మాట్లాడుతూ భవన నిర్మాణ పనులను జనవరి 2025 లోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. టీఎస్ఎమ్ఐడిసి ఇఇ ఏ.రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సహించం

**ప్రజాపక్షం/బెజ్జంకి:** భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదని దళిత హక్కుల పోరాట సమితి సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి బోనగిరి రూపేష్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టి బొమ్మను దగ్ధం చేశారు.అనంతరం సంఘం నాయకులు దీటి బాల్‌నర్సు,రాజ్ కుమార్ మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమ న్యాయం కోసం హక్కులను కల్పించింది అంబేద్కర్ అని, వారు రచించిన రాజ్యాంగం హక్కులనే కాలరాయాలని బీజేపి కుట్రపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగెం మధు,లింగాల బాబు,బిగుళ్ళ మోహన్,బోనగిరి ఆనంద్,కొడముంజ శంకర్,బోనగిరి తిరుపతి ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలంలోని వెంకట్రావు పల్లె గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను శుక్రవారం పెద్దపల్లి జిల్లా జడ్పీ సీఈవో కె.నరేందర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే ను పగడ్బందీగా నిర్వహించాలని అలాగే ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు తప్పులకు తావు లేకుండా సక్రమంగా సర్వే నిర్వహించాలని, ఏన్యూమరేటర్లకు నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ప్రతిరోజు సర్వే చేపట్టాలన్నారు. ప్రతి దరఖాస్తు దారుడి ఇంటి వద్ద ప్రస్తుత స్థితిగతులు తెలిసేలా చాయచిత్రాన్ని యాప్ లో అప్ లోడ్ చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శైలజ రాణి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.



## జెడ్‌పి విద్యార్థుల ప్రతిభ భేష్

**ప్రజాపక్షం / ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జెడ్పి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న బత్తిని అర్జున్ ట్రైథ్లాన్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి ఈ నెల 31 న హన్మకొండలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అలాగే కబడ్డీ పోటీలలో ప్రథమ స్థానం సాధించినతొమ్మిదవ తరగతి చదువుతున్న పాశ్వాన్ అక్షర సైతం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయింది. పాఠశాల హెడ్ మాస్టర్ కొలిచాల శ్రీనివాస్, పీఈటి స్వప్న, టీచర్లు అభినందించారు.

## వంతెన పూర్తయినా.. తప్పని 'కంకర' కష్టాలు!



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం బ్రహ్మణపల్లి గ్రామం వద్ద ప్రధాన రహదారి రోడ్యాంపై సుమారు రూ. 1.50 కోట్లతో పైవంతెన నిర్మాణం చేపట్టారు. అయితే వంతెన పూర్తి అయినప్పటికి ఇరువైపుల అప్రోచ్ రోడ్లు మాత్రం పూర్తి చేయలేదు. వంతెన సిమెంటు రోడ్డుకు ఇరువైపుల ఉన్న తారు రోడ్డుకు అనుసంధానంగా తారు రోడ్డు నిర్మించాల్సి ఉంది. కంకరతో రోడ్డు నిర్మించి గుత్తేదారు వదిలేశారు. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కంకర దారులపై తారు రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

# మహిళలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుదాం

### కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/గంగాధరః** మహిళల సమస్యలు పరిష్కరించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ఆరు నెలల కిందట శుక్రవారం సభకు శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో శుక్రవారం మహిళాభివృద్ధి ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ ఏర్పాటు చేశారు.కలెక్టర్ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే ఈ సభకు వస్తే మహిళలకు అన్ని ఆరోగ్య విషయాలు తెలుస్తాయన్నారు. ఇంటికి దీపం ఇల్లాలు అని, ఆమె బాగుంటే కుటుంబం, కుటుంబం బాగుంటే ఊరు, తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇంద్ర ధనస్సులో రంగుల మాదిరి మన భోజనంలో అన్ని పోషక పధార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు. గర్భిణీగా నిర్ధారణ అయినప్పటి నుంచి మొదటి వెయ్యి రోజులు పోషకాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. సమతుల్య ఆహారం తీసుకుంటే తప్పనిసరిగా కాల్షియం, ఐరన్ మాత్రలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య మహిళ కింద 54 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తున్నామని, మహిళలు విధిగా ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ పరీక్షలే ప్రైవేట్ ఆసుపత్రిలో చేయించుకుంటే రూ.40 వేలకు పైగా ఖర్చు అవుతాయన్నారు. బిపి, షుగర్, రక్తహీనత తదితర వైద్య పరీక్షలతో పాటు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. ఆరోగ్యాన్ని ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా ఆరు నెలలకోసారి సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని మహిళలకు సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారులతో ముచ్చటించారు. అక్కడే ఉన్న ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థులను భవిష్యత్తులో ఏం అవుతారని అడిగి తెలుసుకున్నారు. పోషకాహార పధార్థాలు ప్రదర్శించారు. గర్భిణులు, బాలింతలు అందుతున్న సేవల గురించి వివరించారు. వైద్య శిబిరంలో 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలకు ప్రహారీ, అదనపు తరగతి గది ఏర్పాటు చేయాలని పలువురు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌వో వెంకట రమణ, డిడబ్ల్యూవో సబిత, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, సిడిపివో కస్తూరి, ఏసిడిపిఓ నర్సింగారాణి, ఎంపివో జనార్దన్ రెడ్డి, తహసీల్దార్ అనుపమ, మెడికల్ ఆఫీసర్ శ్వేత, డిసిపివో పర్వీన్ పాల్గొన్నారు.

